PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక :126 | విజయవాడ, బుధవారం 7 డిసెంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Wednesday 7 December 2022 | Rs

ఓపిఎస్ అమలు కోసం

నిర్దిష్ట కార్యాచరణ

- సిపిఎస్‌పై మరో సమావేశం
- పెండింగ్ సమస్యలపై చర్చకే భేటీ పరిమితం
- అవుట్‌సోర్సింగ్‌పై దాటవేసిన మంత్రులు

● లోపలి పేజీలో.. ●



అరటి రైతు దిగాలు

- సగానికిపైగా పడిపోయిన ధర

● లోపలి పేజీలో.. ●



// CONFIDENTIAL //

DIRECTORATE OF WORKS ACCOUNTS
AP, IBRAHIMPATNAM, VIJAYAWADA

Memo No.DWA/AP/IBM/Sn.II/A.1/2022-23/ 235 Dated: 05.12.2022

Sub:- Outsourcing personnel – Outsourcing personnel working in Works Accounts Department - Discontinuation of the services - further Instructions issued – Reg.

Ref:- T.O.Memo No. DWA/AP/IBM/Sn.II/A.1/2022-23/232 dt.01.12.2022.

*****

In partial modification of the instructions issued vide reference cited, all the officers in the address entry are hereby directed to address the Managing Director, APCOS to keep their letters addressed to the MD, APCOS for discontinuation of Outsourcing employees of their offices in abeyance for time being.

Director of Works Accounts
AP, Ibrahimpatnam, Vijayawada

'అవుట్‌సోర్సింగ్ ' మెడపైనే కత్తి!

స్పష్టం చేస్తున్న ప్రభుత్వ తాజా ఆదేశాలు

తాత్కాలికంగానే 'తొలగింపు' ఉత్తర్వులు నిలిపివేత

అది కూడా 'ప్రస్తుతానికే' అని మెమో!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేది లేదంటూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ప్రకటన కంటితుడుపేనని తేలిపోయింది. తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం 'తొలగింపు ప్రక్రియను ప్రస్తుతానికి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు' (అబయెన్స్ ఫర్ టైమ్ బీయింగ్) పేర్కొంది. దీంతో ప్రభుత్వ చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా మారింది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మెడపైనే సర్కారు కత్తి ఉందని స్పష్టమైంది. పది సంవత్సరాల సర్వీసు పూర్తికాని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందంటూ ప్రజాశక్తి ప్రచురించిన కథనం కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులపై ఉద్యోగ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేది లేదని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సోమవారం ప్రకటించారు. ఆ ఉత్తర్వులపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారని కూడా ఆయన చెప్పారు. వర్క్స్, అక్కౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో జారీ అయిన తొలగింపు ఉత్తర్వులను కూడా ప్రజాశక్తి ప్రచురించడంతో తాజాగా మరో మెమో జారీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారమైతే ఈ ఉత్తర్వుల్లో తొలగిపు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు తాజా మెమోలో పేర్కొనాల్సిఉంది. దానికి భిన్నంగా తాత్కాలింగానే తొలగింపు ఉత్తర్వులను నిలిపివేస్తున్నట్లు పేర్కొనడం, అది కూడా ప్రస్తుతానికే అని నొక్కి చెప్పడం గమనార్హం. 'కమ్యూనికేషన్ గ్యాప్' కారణంగా తొలగింపు ఉత్తర్వులు జారీ అయ్యాయని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే.

దక్షిణ కోస్తాంధ్రకు తుపాను

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. ఇది వాయువ్య దిశగా కదులుతూ కోస్తాంధ్ర- తమిళనాడు తీరానికి దగ్గరగా వస్తూ మరింత బలపడి గురువారానికి తుపానుగా మరే అవకాశం ఉందని తెలిపింది. వాయుగుండం ప్రభావంతో బుధవారం నాడు తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాలు, రాయలసీమల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. గురువారం నుంచి శనివారం వరకు దక్షిణ కోస్తా, తమిళనాడులో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు తిరుపతి, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలకు కురిసే అవకాశం ఉందని ఐఎండి వెల్లడించింది. మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

అప్రమత్తంగా ఉన్నాం : సిఎస్ జవహర్‌రెడ్డి

తుపానును ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉన్నామని సిఎస్ కె.ఎస్.జవహర్‌రెడ్డి తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోపాటు మరో రెండు సమీప జిల్లాలపై తుపాను ప్రభావం ఉండొచ్చని వివరించారు. ప్రస్తుతం 11 ఎస్‌డిఆర్‌ఎఫ్, 10 ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీచేశామన్నారు. వేటకు వెళ్లిన వారు వెంటనే తిరిగి వచ్చేయాలని సూచనలు చేశామని తెలిపారు.

మతోన్మాదంపై ప్రజా చైతన్య పోరాటాలు

జాతీయోద్యమ స్ఫూర్తితో నిర్వహణ • లౌకికరాజ్యాంగ పరిరక్షణ వేదిక పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మతోన్మాదానికి వ్యతిరేకంగా జాతీయోద్యమ స్ఫూర్తితో ప్రజా చైతన్య పోరాటాలను నిర్వహించాలని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక పిలుపునిచ్చింది. విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రసంగించిన పలువురు వక్తలు బిజెపి, దాని మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అధికారం కోసం ఎంతటి నరమేథం సృష్టించడానికైనా వెనుకాడవని బాబ్రీమసీదు కూల్చివేత, గుజరాత్ మారణకాండ ఘటనలు నిరూపిస్తున్నాయని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో తొలుత ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సభకు హాజరైన వారి చేత రాజ్యాంగ పీఠికను చదివించి ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం మైనార్టీలు, క్రైస్తవులు, దళితులు మీద దాడులు చేస్తూ రాజ్యాంగ మౌళిక సూత్రాలను తుంగలో తొక్కుతోందని విమర్శించారు. అధికారం కోసం ఆర్‌ఎస్‌ఎస్ ఎలాంటి అనైతిక పద్ధతులకైనా వెనుకాడదన్నారు. 30 ఏళ్లక్రితం బాబ్రీ మసీదును కూల్చిన ఆర్‌ఎస్‌ఎస్ ఆ తర్వాత 10 ఏళ్లకు గోద్రాలో మారణహోమం సృష్టించిందని చెప్పారు. మోడీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ కాషాయీకరిస్తోందన్నారు. భారత చరిత్ర తలదించుకునేలా చట్టం, ఆధారాలు కాకుండా విశ్వాసాలకు అనుగుణంగా బాబ్రీ మసీదు ఘటనపై సుప్రీం కోర్టు తీర్పు చెప్పిందని అన్నారు.

సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎంపి అజీజ్‌పాషా మాట్లాడుతూ దేశంలో జాతీయోద్యమ చరిత్రపై ఆర్‌ఎస్‌ఎస్ అసత్యాలను ప్రచారం చేస్తోందన్నారు. ప్రపంచ ఆకలిసూచిలో మన దేశం పొరుగున వున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ కంటే దిగజారి పోయినా మోడీకి పట్టడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్ మాట్లాడుతూ అధికారం కోసం ఇన్నాళ్లూ ముస్లిములపై దుష్ప్రచారం చేసిన ఆర్‌ఎస్‌ఎస్ ఇప్పుడు క్రైస్తవులు, దళితులపై దాడికి దిగుతోందని అన్నారు. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, దానికి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు విశాల ప్రాతపాదికన ప్రజల్లోకి వెళ్లి జాతీయోద్యమ విలువలను చాటిచెప్పాలని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ అధికారంకోసం చివరకు స్వదేశీ జాగరణ మంచ్ అజెండాను కూడా పక్కనపెట్టిందని అన్నారు. ఓట్లలో చీలిక కోసం ఓవైసితో కుమ్మక్కయి పోటీ చేయిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి ఎన్ తులసిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఎనిమిదేళ్లలో ఎనిమిది రాష్ట్ర ప్రభుత్వాలను రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా భిన్నంగా కూల్చివేసిందని అన్నారు. టిడిపి మైనార్టీసెల్ అధ్యక్షులు ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ 1992లో కూల్చింది బాబ్రీమసీదు కాదని భారత రాజ్యంగాన్ని అని చెప్పారు. వైసిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు మునీర్ అహ్మద్ మాట్లాడుతూ దేశాన్ని అదాని, అంబానీలకు దోచిపెట్టేందుకే మోడీ, అమిత్ షా పనిచేస్తున్నారని అన్నారు. సిఎఎ, ఎన్‌ఆర్‌సిలతో మరోమారు బిజెపి భయానక వాతావరణం సృష్టించేందుకు కుట్రలు చేస్తోందని అన్నారు. ఈ సదస్సులో ప్రముఖ హైకోర్టు న్యాయవాది అబ్దుల్ మతీన్, సిపిఐఎంఎల్ (లిబరేషన్) పార్టీ నాయకులు హరనాథ్, అవాజ్ రాష్ట్ర నాయకులు చిష్టీ మాట్లాడారు. మాజీ ఎంపి పి.మధు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ఎపి వ్యవసాయకార్మిక సంఘం(దాసరిభవన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఐఎఫ్‌టియు నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఆర్‌ఎస్‌ఎస్ లోతుపాతులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

అంబేద్కర్‌కి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజా సమస్యలపై చర్చ

అఖిల పక్షంలో విపక్షాల డిమాండ్

నేటి నుండి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో దేశ వ్యాప్తంగా ప్రజానీకం ఎదుర్కుంటున్న వివిధ సమస్యలపై చర్చకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. బుధవారం నుండి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. పార్లమెంటు లైబ్రరీ బిల్డింగ్‌లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సమావేశంలో ప్రతిపక్షాలు ఆర్థిక మందగమనం, నిరుద్యోగం, అధికధరలు తదితర అంశాలతో పాటు రాష్ట్రాలపై గవర్నర్ల పెత్తనం అంశాన్ని కూడా చర్చించాలని కోరాయి. ఈ సమావేశాల్లో 19 కొత్త బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టనుంది. వీటితో పాటు మరో 6 సవరణ బిల్లులను కూడా ఆమోదింపచేసుకోవాలని కేంద్రం భావిస్తోంది. బిల్లుల ఆమోదానికి సహకరించాలని ప్రతిపక్షాలను ప్రభుత్వం కోరింది. బుధవారం నుండి డిసెంబర్ 29 వరకు పార్లమెంటు సమావేశాలు జరగనున్నాయి.

నిరుద్యోగంపై చర్చించాలి : కాంగ్రెస్

ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోటా, నిరుద్యోగం, ధరలు పెరుగుదల తదితర అంశాలపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. సభలో తాము జాతీయ భద్రత, కాశ్మీరీ పండిట్ల హత్యలపై చర్చకు డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఎయిమ్స్‌పై సైబర్ దాడి, రైతులకు ఎంఎస్‌పి, ఉద్యోగాల భర్తీ, ఉపాధిహామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టాల నిర్వీర్యం, న్యాయ వ్యవస్థపై కేంద్రం దాడి, స్వతంత్ర సంస్థల ధ్వంసం, రూపాయి పతనం, దేశంలో ప్రమాద స్థాయిలో కాలుష్యం, మహిళలపై దాడులు తదితర అంశాలను లేవనెత్తుతామని తెలిపారు.

ప్రజా సమస్యలు ... గవర్నర్ల పెత్తనం : సిపిఎం

రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలపై గవర్నర్లు పెత్తనం చెలాయిస్తున్నారని, దీనిపై చర్చించాలని సిపిఎం నేతలు పిఆర్ నటరాజన్, బికాష్ రంజన్ భట్టాచార్య డిమాండ్ చేశారు. వారు మీడియాతో మాట్లాడుతూ ధరలు పెరుగుదల, నిరుద్యోగం, కనీస మద్దతు ధర, ఆర్థిక మందగమనం వంటి ప్రజా సమస్యలతో గవర్నర్ల అంశాన్ని లేవనెత్తామని తెలిపారు. సమాఖ్య వ్యవస్థను పటిష్ట పరచాలని డిమాండ్ చేశామన్నారు. అలాగే న్యాయ వ్యవస్థపై జరుగుతున్న దాడిని లేవనెత్తామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని బిజెడి డిమాండ్ చేయగా, జనాభా నియంత్రణ బిల్లును ఆమోదించాలని శివసేన షిండే వర్గం కోరింది. పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్)పై చర్చ జరగాలని, రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ఉండేలా చట్టం తేవాలని ఆప్ నేత సంజయ్ సింగ్ డిమాండ్ చేశారు. సమావేశాలు సజావుగా జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. పార్లమెంట్ నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఉభయ సభల బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి) సమావేశాల్లో చర్చకు సంబంధించిన అంశాలను ఖరారు చేస్తామని ఆయన చెప్పారు. అఖిల పక్ష సమావేశానికి దాదాపు 30కి పైగా పార్టీల నేతలు హాజరయ్యారు.

సున్నం బట్టీ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

విలపిస్తున్న కుటుంబసభ్యులు

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణం చంద్రపాలెంలోని సున్నం బట్టీలో మంగళవారం ఒక కార్మికుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... చంద్రపాలెం ప్రాంతానికి చెందిన అంబోరు నాగేశ్వరరావు (35) మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు సున్నం బట్టీ పనికి వెళ్లారు. సున్నాన్ని బట్టీ నుంచి బయటకు తెచ్చే క్రమంలో కుప్పకూలి పడిపోయారు. ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బట్టీలో నుండి వచ్చిన విషవాయువుల వల్లే నాగేశ్వరరావు మృతి చెందాడంటూ ఆయన మృతదేహంతో కుటుంబసభ్యులు, తోటి కార్మికులు సున్నపు బట్టీ ముందు ఆందోళనకు దిగారు. మృతుని కుటుంబానికి యాజమాన్యం రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని సున్నం వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ గిరిబాబు, టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పరిహారంగా రూ.2.10 లక్షలు, దహన సంస్కారాల కోసం పది వేల రూపాయలు ఇవ్వడానికి యజమాని ఒప్పుకున్నారు.

జాతాకు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో పూలు, హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు, ప్రజా సంఘాల నాయకులు

రైతు ఆత్మహత్యలేనా అద్భుత పాలన?

- ఇది కార్పొరేట్ల ప్రభుత్వం
- అమరవీరుల జ్యోతి యాత్ర బహిరంగ సభల్లో ఎఐకెఎస్ నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

రైతుల ఆత్మహత్యలేనా అద్భుత పాలన అని కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) నాయకులు ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం సామాన్యుల ప్రభుత్వం కాదని, కార్పొరేట్ల ప్రభుత్వమని విమర్శించారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని అన్నారు. వ్యవసాయాన్ని ప్రధాని మోడీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించడంతోపాటు మరింత సంక్షోభంలోకి నెడుతోందని విమర్శించారు. రైతుల పక్షాన ఉంటాయో? కార్పొరేట్ల పక్షాన ఉంటాయో వివిధ రాజకీయ పార్టీలు పున:సమీక్షించుకోవాలని కోరారు. రైతులకు రాయితీలు, మద్దతు ధరల కోసం ఎఐకెఎస్ చేసే పోరాటాల్లో రైతులు భాగస్వాములు కావాలని కోరారు. ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) అఖిల భారత మహాసభ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం జనగాంలోని దొడ్డి కొమరయ్య అమరవీరుల స్తూపం నుంచి సోమవారం ప్రారంభమైన అమరవీరుల జ్యోతి యాత్ర మంగళవారం గుంటూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సాగింది. ఈ యాత్రను రైతులు, కార్మికులు, రైతు సంఘం, సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు ఎక్కడికక్కడే మిగతా 5లో

దేవినేని అవినాష్ ఇంట్లో ఐటి సోదాలు

ఐటి సోదాల నేపథ్యంలో గుణదలలోని దేవినేని ఇంటి వద్ద అనుచరుల ఆందోళన, (ఇన్‌సెట్‌లో) అవినాష్

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

మాజీ మంత్రి దేవినేని నెహ్రూ తనయుడు, వైసిపి విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్ ఇంట్లో ఆదాయ పన్ను శాఖాధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గుణదలలోని ఆయన ఇంట్లో ఉదయం 6.30 గంటల నుండి తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ బంజారా హిల్స్‌లో అవినాష్ కుటుంబ సభ్యులకు ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలాన్ని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థకు దీర్ఘకాలం లీజుకు ఇచ్చారు. ఈ భూమి వ్యవహారానికి సంబంధించి ఎటువంటి లావాదేవీలూ నిర్వహించారనే దానిపై ఐటి అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. మూడు బృందాలుగా వచ్చిన ఐటి అధికారులు పలు కీలక పత్రాలు, కంప్యూటర్ హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం వరకూ సోదాలు చేసిన తర్వాత రెండు బృందాలు వెళ్లపోగా, మరో బృందం సోదాలు కొనసాగిస్తోంది. మరోవైపు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని స్థిరాస్థి వ్యాపారి ఇంట్లోనూ ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు. వంశీరామ్ బిల్డర్స్ యజమాని ఇల్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. హైదరాబాద్, విజయవాడతోపాటు నెల్లూరులోనూ ఆ సంస్థకు చెందిన సిఇఒ, డైరెక్టర్లు, పెట్టుబడిదారుల కార్యాలయాలు, ఇళ్లలో సోదాలు జరుగుతున్నాయి. ఈ తనిఖీల్లో 20కిపైగా బృందాలు పాల్గొంటున్నాయి.

అవినాష్ అనుచరుల నిరసన

ఐటి అధికారుల సోదాలను నిరసిస్తూ వైసిపి కార్యకర్తలు, దేవినేని అవినాష్ అనుచరులు ఆయన ఇంటి వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. దీంతో, గుణదలతోపాటు రామవరప్పాడు రింగురోడ్డు జాతీయ రహదారి వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వందలాది వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వారికి సర్దిచెప్పడంతో నిరసన విరమించారు.

సభలో మాట్లాడుతున్న తపన్‌సేన్

ఐసిడిఎస్ బలోపేతానికి ఐక్య ఉద్యమాలు

అంగన్‌వాడీ 10వ మహాసభ ప్రారంభోపన్యాసంలో తపన్‌సేన్

మదురై : గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంరక్షణ కోసం ఐసిడిఎస్ ద్వారా ఎనలేని కృషి జరుగుతోందని, వీటి బలోపేతానికి ఐక్య ఉద్యమాలు చేపట్టాలని సిఐటియు ప్రధానకార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశంలో ఉన్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మదురైలో నాలుగు రోజుల పాటు జరగనున్న ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (ఎఐఎఫ్ఎడబ్ల్యూహెచ్) 10వ మహాసభను మంగళవారం తపన్‌సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ఉన్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ ఉమ్మడి శత్రువును గుర్తించి, ఎదుర్కోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లో సైతం సిఐటియు సందేశాన్ని వ్యాప్తి చేయడంలో ఎఐఎఫ్ఎడబ్ల్యూహెచ్ ప్రధాన పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. ఎఐఎఫ్ఎడబ్ల్యూహెచ్ ఎంత పురోగతి సాధించినప్పటికీ, సాధారణ సమస్యలు, అంతరాలు ఉన్నాయని, వాటిని అధిగమించాల్సి ఉందని చెప్పారు. సవాళ్లను ఎలా పరిష్కరించాలి, అధిగమించాలి అనేది ఈ మహాసభల సదస్సు యొక్క లక్ష్యమని తెలిపారు. బాబ్రీ మసీదు సంఘటనను ప్రస్తావిస్తూ.. ఆ సంఘటన జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకూ రాజకీయాలు భారీ మార్పును చూశాయని చెప్పారు. ప్రజలను పణంగా పెట్టి విభజించి మిగతా 5లో

ప్రొఫెసర్ సాయిబాబాను విడుదల చేయాలి

- సిజెఐకి 19 అంతర్జాతీయ సంస్థల లేఖ

న్యూఢిల్లీ : ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా విడుదలపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పున:పరిశీలించాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తికి 19 అంతర్జాతీయ సంస్థలు లేఖ రాశాయి. అనారోగ్య కారణాల రీత్యా సాయి బాబా విడుదలను పరిశీలించాలని సోమవారం పంపిన లేఖలో కోరాయి. మావోయిస్టులతో సంబంధం కేసులో సాయిబాబాను నిర్దోషిగా పేర్కొంటూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయం తెలిసిందే. అమెరికాకు చెందిన స్కాలర్స్ ఎట్ రిస్క్, పలు దేశాల్లోని ప్రఖ్యాత విద్యా సంస్థలతో కూడిన అంతర్జాతీయ నెట్‌వర్క్, విద్యాసంస్థలు లేఖ రాశాయి. 80శాతం వైకల్యంతో బాధపడుతున్న సాయిబాబా సుదీర్ఘకాలంగా జైల్లో ఉండటంతో అనారోగ్యం తీవ్రమైందని లేఖలో ప్రస్తావించాయి. పోలియో సహా వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, ప్రాణాంతకమైన ప్యాంక్రియా టైటిస్, గాల్ బ్లాడర్ స్టోన్స్‌లకు వెంటనే శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని తెలిపాయి. రెండుమార్లు కరోనా వైరస్‌లతో పాటు అనేకమార్లు వైద్య చికిత్స పొందలేకపోయారని లేఖలో పేర్కొన్నాయి.



అంబేద్కర్‌కు సిఎం నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులు అర్పించారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పినెపి విశ్వరూప్, మేరుగ నాగార్జున, ఎంపిలు నందిగం సురేష్, అవినాష్ రెడ్డి, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ పాల్గొన్నారు.

వైసిపి కేంద్ర కార్యాలయంలో

తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మేరుగ నాగార్జున, ఎంపి నందిగం సురేష్, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి, నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ ఛైర్మన్ నారాయణమూర్తి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, దడాల సుబ్బారావు తదితరులు

నేడు జయహో బిసి మహాసభ

- హాజరు కానున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరో ఏడాదిన్నరలో ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో వెనుకబడిన తరగతులే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జయహో బిసి మహాసభ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. బుధవారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్న జయహో బిసి మహాసభకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. బిసిల్లో పట్టుపెంచుకునే దిశగా అధికార పార్టీ ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. 2019 ఎన్నికలకు ముందు ఏలూరులో నిర్వహించిన బిసి గర్జన సభలో ప్రకటించిన బిసి డిక్లరేషన్ సత్ఫలితాలు ఇచ్చిన నేపథ్యంలో 2024 ఎన్నికలకు ముందు బిసిలకు దిశానిర్దేశం చేసేలా ఈ సభను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో గ్రామీణస్థాయిలో వార్డుమెంబర్ నుండి రాజ్యసభ సభ్యులుదాకా వైసిపికి చెందిన ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్రంలో బిసి కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరక్టర్లను కలిపి మొత్తం 82 వేల మంది బిసి ప్రజాప్రతినిధులను ఈ మహాసభకు ఆహ్వానించారు. దీనికి సిఎం జగన్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

బలహీనవర్గాల ప్రజలకు రక్షణ కరువు : టిడిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పేద, బడుగు, బలహీవర్గాల ప్రాణాలకు ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు. కొల్లు రవీంద్ర, చింతకాయల అయ్యన్నపాత్రుడు, నక్కా ఆనందాబు, బోండా ఉమామహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 66వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమసమాజాన్ని కోరుకున్న అంబేద్కర్ కలలను బుగ్గిపాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకం రాజ్యమేలుతోందన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా టిడిపి అరాచకశక్తులపై పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి, ఎస్‌సి, ఎస్‌టి విభాగం నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇదేం ఖర్మ మన బిసిలకు పేరుతో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వెనుకబడిన వర్గాల వెన్నెముక వైసిపి

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వెనుకబడిన వర్గాలకు వైసిపి వెన్నుముకగా ఉందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకూ పాలించిన పార్టీలన్నీ బిసిలకు అన్యాయం చేశాయని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాతే వారికి ప్రాధాన్యత వచ్చిందని అన్నారు. జనాభా దామాషా పద్ధతిలో సామాజిక న్యాయం కాపాడుతున్నారని వివరించారు. అందరినీ కాపాడే విధంగా సిఎం అడుగులు ముందుకు వేస్తున్నారని పేర్కొన్నారు. బిసిలకు పదవులు ఇవ్వాలని చట్టం చేసి మరీ పదవులు కేటాయించిన నాయకుడు జగన్ అని అన్నారు. వారి సంక్షేమం కోసం రూ.90 వేల కోట్లు వెచ్చించారని తెలిపారు. సామాన్య కార్యకర్తగా ఉన్న తనను స్పీకర్‌ను చేశారని అన్నారు. అన్ని కులాలను అక్కున చేర్చుకున్నారని వివరించారు.

ఓపిఎస్ అమలు కోసం నిర్దిష్ట కార్యాచరణ

- సిపిఎస్‌పై మరో సమావేశం
- పెండింగ్ సమస్యలపై చర్చకే భేటీ పరిమితం
- అవుట్‌సోర్సింగ్‌పై దాటవేసిన మంత్రులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఎస్ అంశంపై కాకుండా ఓపిఎస్ అమలు కోసం నిర్దిష్టంగా కార్యాచరణ తీసుకోవాలని, 2003 డిఎస్‌సి ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు, ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగులు దాచి పెట్టుకున్న ఎపిజిఎల్‌ఐ, పిఎఫ్, సరెండర్‌లీవ్‌లకు చెల్లించాల్సిన బకాయిలు రూ. 1826 కోట్ల చెల్లింపుల కోసం రోడ్‌మ్యాప్ ప్రకటించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయంలోని రెండో బ్లాక్‌లో మంగళవారం ఉద్యోగుల పెండింగ్ అంశాలు, సిపిఎస్‌పై ఉద్యోగ సంఘాలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లు, రేషనలైజేషన్ ప్రకియతో ముడిపడి ఉండటంతో వెంటనే బదిలీల ప్రక్రియ చేపట్టాలని, మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలకు సర్వీస్ రూల్స్ రూపొందించాలని, పిఆర్‌సికి సంబంధించిన బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో చర్చ జరిగిన అంశాలపై డిపార్టుమెంటు వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని కోరారు. ఈ నెల 8న అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రులు హామీ నిచ్చారు. ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిపిఎస్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రులు తెలిపినట్లు వివరించారు. ఎయిడెడ్, గురుకులాలు, గ్రంథాలయాలు, కార్పొరేషన్ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు విషయంలో తగు నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎస్‌టియు ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మయ్య మాట్లాడుతూ ఈ నెల 7న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపామన్నారు. బొప్పరాజు మాట్లాడుతూ సిపిఎస్ రద్దుపై చర్చ అని పిలిచారని, ఉద్యోగ సమస్యలపై చర్చకు రమ్మని జిఎడి నుండి పిలుపు వచ్చిందన్నారు. పాత పింఛన్ విధానంపై మాత్రమే చర్చిస్తామని మంత్రుల కమిటీకి స్పష్టం చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పథకాల నుంచి రాయితీ ఇవాల్సని కోరినట్లు తెలిపారు. ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆస్కార్‌రావు మాట్లాడుతూ ఆరు అంశాలు ముందుంచామని తెలిపారు. సర్వీసు నుంచి రిటైరైన వారికి, రూ.3 వేల కోట్ల బకాయిలున్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని కోరామని వివరించారు. ఫేసియల్ రికగ్నైజెషన్ విధానంలో ఆబ్సెంట్ అయిన వారికి జీతాలు కట్ చేస్తున్నారని తెలిపారు. అధికారులు ఒక రకంగా చెబుతుంటే మంత్రులు మరో రకంగా మాట్లాడుతున్నారని వివరించారు. అవుట్ సోర్సింగ్ విధానంపై చర్చల్లో ప్రభుత్వం వైపు నుంచి స్పష్టమైన క్లారిటీ రాలేదని తెలిపారు. ఆప్కాస్ ద్వారా ఆయా శాఖల్లో అదనంగా నున్న సిబ్బందిని సర్దుబాటు చేసేందుకు ప్యానెల్ ఏర్పాటు చేసినట్లు మంత్రులు ఉద్యోగ సంఘాలకు స్పష్టం చేశారని పేర్కొన్నారు. ఎపిటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న బొత్స, సజ్జల, ఆదిమూలపు

సమావేశానంతరం మంత్రులు బొత్ససత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ సిపిఎస్ అంశంపై చర్చలు అని కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల వచ్చిందని, సిపిఎస్‌పై ప్రత్యేక సమావేశం త్వరలో నిర్వహిస్తామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉద్యోగులందరూ సంతృప్తిగా ఉన్నట్లు తాము భావిస్తున్నామన్నారు. సిపిఎస్ ఉద్యోగులను ఈ రోజు తాము పిలవలేదన్నారు. గురుకులాలు, కార్పొరేషన్ల సిబ్బందికి వయో పరిమితిపై త్వరలో తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై ప్రజాశక్తి అడిగిన ప్రశ్నకు మంత్రి బొత్స స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా దాటవేశారు.

ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఆర్థికశాఖ కార్యదర్శి గుల్జార్, సర్వీసెస్ అండ్ హెచ్ఆర్‌శాఖ కార్యదర్శి పి.భాస్కర్, ప్రభుత్వ సలహాదారు(ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాదు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ, ఎపి ఎస్‌టియు అధ్యక్షులు ఎల్ సాయి శ్రీనివాస్, యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, ఎపిటిఎఫ్ అధ్యక్షులు జి.హృదయరాజు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నా ఓటమికి అదే కారణం

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు 30 శాతం విదేశాలకు వెళ్లడంతోనే తాము ఓటమి చెందామని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొత్త భాష్యం చెప్పారు. తాము తయారు చేసిన వారంతా ఇప్పుడు ఆయా దేశాల్లో టిడిపి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అందుకే ఎన్ఆర్ఐలకు ఓటు హక్కు ఇవ్వాలనే డిమాండును సమర్థిస్తున్నామన్నారు. మంగళవారం నాడిక్కడ అశోక రోడ్డు-50లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాళ్లను అర్ధ రాత్రుళ్లే అరెస్టు చేస్తున్నారని, ప్రతిపక్షాలపైనే కాకుండా సామాన్య ప్రజలపైన కూడా వైసిపి ప్రభుత్వం దాడి చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వంపై తిరగబడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఎన్నికలు రేపొచ్చిన తాము సిద్ధంగానే ఉన్నామన్నారు. వైసిపి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును కనీసం అవగాహన కూడా చేసుకోవడం లేదన్నారు. తెలంగాణలో కూడా తమ పార్టీకి ఓటు బ్యాంక్ ఉందని తెలిపారు. ఎన్నికల పొత్తులపై అప్పుడే చెప్పలేమన్నారు.

జనాభా నియంత్రణ వద్దు

ప్రస్తుత పరిస్థితుల్లో జనాభా నియంత్రణ మంచిది కాదని చంద్రబాబు అన్నారు. జనాభాను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు జనాభా నియంత్రణ పరిష్కారం కాబోదన్నారు. అలా ప్రచారం చేయడం అపోహ మాత్రమేనని ఆయన చెప్పారు. జనాభాను పెంచకపోతే భవిష్యత్తులో అనేక నష్టాలు కలుగుతాయని పేర్కొన్నారు. డిజిటల్, సాంకేతక పరిజ్ఞానం వాడాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని, ప్రతి వ్యక్తి రోజువారీ జీవితంలో మొబైల్ ఫోన్ ఒక భాగమైందన్నారు.

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న చంద్రబాబు తదితరులు

నీతి ఆయోగ్ సిఇఒతో భేటీ

దేశాభివృద్ధి కోసం డిజిటల్ పరిజ్ఞానంపై విజన్ డాక్యుమెంట్ రూపొందించాల్సిన అవసరముందని మాజీ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబునాయుడు అన్నారు. మంగళవారం ఇక్కడి నీతి ఆయోగ్ భవన్‌లో ఆ సంస్థ సిఇఒ పరమేశ్వరన్ అయ్యర్‌తో ఆయన భేటీ అయ్యారు. డిజిటల్ పరిజ్ఞానంపై ఇరువురు చర్చించారు. విజన్-2047 డాక్యుమెంట్‌పై తన అభిప్రాయాలను చంద్రబాబు పంచుకున్నారు. దేశానికి స్వాతంత్ర వచ్చి వందేళ్లు కావస్తున్న నేపథ్యంలో ఈ డాక్యుమెంట్ అవసరమని తెలిపారు. దేశవిదేశాల్లో భారతీయులు రాజకీయంగా, ఆర్థికంగా రాణిస్తున్నారని, ఈ నేపథ్యంలో దేశ యువతరం మరింత ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాల్సిన అవసరముందని ఇరువురు అభిప్రాయపడ్డారు. చంద్రబాబు వెంట టిడిపి ఎంపి రామ్మోహన్ నాయుడు, మాజీ ఎంపి కంభంపాటి రామ్మోహన్‌రావు ఉన్నారు. అంతకు ముందుకు అశోక రోడ్డు-50లో గల్లా జయదేవ్ నివాసంలో చంద్రబాబు, టిడిపి నేతలతో నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షులు ఫరూక్ అబ్దుల్లా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం చంద్రబాబు, అబ్దుల్లా ఇరువురు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈడి దెబ్బకు చంద్రబాబు ఢిల్లీ పయనం

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో జరిగిన స్కామ్‌పై ఈడి దాడులు చేయగానే చంద్రబాబునాయుడు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలో వున్నన్నాళ్లు ప్రజలను పూర్తిగా విస్మరించి దోచుకో దాచుకో అన్న చందంగా సంపాదనే లక్ష్యంగా చంద్రబాబునాయుడు, లోకేష్ పనిచేశారని విమర్శించారు.

జయహో బిసి మహాసభపై ఉలికిపాటు ఎందుకు

వెనుకబడిన తరగతుల్లో రాజకీయ చైతన్యం నింపేలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జయహో బిసి మహాసభను నిర్వహిస్తే తెలుగుదేశానికి ఉలికిపాటు ఎందుకో అర్థం కావడం లేదని ఆ పార్టీ అధికార ప్రతినిధులు యనమల నాగార్జున యాదవ్, కొండా రాజీవ్‌గాంధీ అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. బిసిల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.

తపస్విని హత్యపై ఫాస్ట్‌ట్రాక్ విచారణకు ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తక్కెళ్లపాడులో మెడికల్ విద్యార్థిని తపస్విని దారుణంగా హత్య చేసిన నిందితుడిని ఫాస్ట్‌ట్రాక్ విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. సమాజంలో పితృస్వామ్య భావజాలం, మహిళలను చులకనగా చూసే వ్యవస్థలవల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు.

హెచ్‌ఎకె అడ్‌హాక్ కమిటీపై స్టే

ప్రజాశక్తి, అమరావతి

ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం (ఎపిహెచ్‌ఎకె) కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించని నేపథ్యంలో అడహాక్ కమిటీ బాధ్యతలు స్వీకరించాలని సింగిల్ జడ్జి ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. బార్ కౌన్సిల్‌సర్వసభ్య సమావేశంలో చర్చించకుండా అడహాక్ కమిటీ చేసిన బార్ కౌన్సిల్ ఛైర్మన్ గంటా రామారావు నిర్ణయాన్ని డివిజన్ బెంచ్ తప్పుపట్టింది. కార్యవర్గం పదవీ కాలం 2023 వరకు పొడిగిస్తూ బార్ కౌన్సిల్ చేసిన తీర్మానం అమల్లో ఉండగా అడహాక్ కమిటీని ఎలా నియమిస్తారని చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ సోమయాజులుతో కూడిన డివిజన్ బెంచ్ ప్రశ్నించింది. విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది.

డ్రమ్ములో కుక్కి సీల్ వేశాడు

- మధురవాడలో మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- 19 నెలల తరువాత వెలుగుచూసిన మృతదేహం..!

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

తనతో సన్నిహితంగా మెలిగిన మహిళను చంపేసి డ్రమ్ములో కుక్కి పరారైన నిందితుడుని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. మూడు రోజులుగా రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన ఈ కేసును పోలీసులు ఛేదించారు. కేసు వివరాలను విశాఖ నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మంగళవారం విలేకరులకు వెల్లడించారు. శ్రీకాకుళానికి చెందిన కె.రిషివర్ధన్ రెండేళ్ల క్రితం విశాఖలో పని చేసేందుకు భార్యతో కలిసి వచ్చాడు. కొద్ది రోజుల తరువాత రమేష్ అనే వ్యక్తి వద్ద వెల్డింగ్ పనికి కుదిరాడు. వికలాంగుల కాలనీలోని రమేష్ ఇంట్లోనే అద్దెకు దిగాడు. కొద్దిరోజులపాటు రిషి సక్రమంగానే పని చేశాడు. గర్భం దాల్చిన భార్యను ప్రసవం కోసమని ఆమె ఇంటికి తీసుకెళ్లి అక్కడే ఉంచాడు. గతేడాది మే 29న శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వచ్చే క్రమంలో ఓ యువతి పరిచయమైంది. మరుసటి రోజు ఆమె ఫోన్ చేసి అతని వద్దకు వచ్చింది. రాత్రంతా అద్దె ఇంట్లోనే గడిపారు. మరుసటి రోజు ఉదయం రూ.2 వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేసింది. తన వద్ద డబ్బులులేవని రిషి బదులిచ్చాడు. అరచి గోల చేసి చుట్టుపక్కల వారిని పిలుస్తానని ఆమె బెదిరించడంతో నిందితుడు ఆమెను బలంగా కొట్టాడు. మెడకు చున్నీ బిగించి హత్య చేశాడు. ఇంటిలో వాడకానికి తెచ్చిన నాలుగు అడుగుల డ్రమ్ములో ఆమె మృతదేహాన్ని కుక్కాడు. వాసన రాకుండా ప్లాస్టిక్ సీల్ వేసి వెళ్లిపోయాడు. కొన్నాళ్లుగా అతను ఇంట్లో ఉండడంలేదు. తాళం వేసి మరోచోట ఉంటున్నాడు. అద్దె కూడా చెల్లించకపోవడంతో ఇంటిని ఖాళీ చేయించి వేరొకరికి ఇచ్చేందుకు యజమాని రమేష్ సిద్ధమయ్యాడు. ఇంట్లోని సామాన్లు బయటపడేసే క్రమంలో డ్రమ్ము నుంచి దుర్వాసన వచ్చింది. అందులో మహిళ మృతదేహం బయటపడింది. దీంతో హత్య విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు మూడు రోజులపాటు విచారణ జరిపి కేసును ఛేదించారు. హత్య చేసిన వెంటనే భయంతో ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి చెన్నై పారిపోయిన నిందతుడు రిషి కొంతకాలం క్రితం మళ్లీ వైజాగ్ వచ్చి చైతన్య ఈ - టెక్నో స్కూల్‌లో వంట మనిషికి సహాయకునిగా చేరాడు. అతన్ని పోలీసులు అరెస్టు చేశారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న సిపి శ్రీకాంత్

రిషివర్ధన్

హతురాలు ధనలక్ష్మిగా గుర్తింపు

హతురాలి హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న ఫోన్ నెంబర్ల ఆధారంగా విచారణ చేయగా శ్రీకాకుళంలోని మొండేటి వీధికి చెందిన బమ్మిడి ధనలక్ష్మి (25)గా ప్రాథమిక నిర్ధారణకు వచ్చామని సిపి తెలిపారు. డిఎన్ఎ శాంపిల్స్‌ను పరిశీలనకు పంపామని, రిపోర్టులు అందిన వెంటనే హతురాలి వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

మతోన్మాద శక్తులను పారదోలాలి

- డివిఎంఎం జాతీయ కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మతోన్మాద శక్తులను తరిమికొట్టడమే అంబేద్కర్‌కు అందించే ఘనమైన నివాళని డిఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అంబేద్కర్ చిత్రపటానికి కెవిపిఎస్ ఆధ్వర్యాన శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, మైనార్టీలపై పెద్దఎత్తున దాడి జరుగుతోందని అన్నారు. సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్లకు అమ్ముతున్నారని విమర్శించారు.

దేశం అధోగతి : నర్సింగరావు

మోడీ పాలనలో దేశం అధోగతి పాలైందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు అన్నారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగాన్ని లూటీ చేసి కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడుతూ మనువాద మతోన్మాద శక్తుల పాలనలో దేశం అన్ని విధాలా దివాళా తీసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బారావు, కె ఉమామహేశ్వరరావు, వెంకటరెడ్డి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

కడప ఉక్కుపై కదలిక ఏదీ?

- ఎన్ని విజ్ఞప్తులు చేసినా స్పందించని కేంద్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సమైక్య రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలలో అనేక అంశాలకు పట్టిన గతే కడప ఉక్కు పరిశ్రమకూ పట్టనుందా? ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా కేంద్రం నుండి స్పందన లేకపోవడంతో అధికారయంత్రాంగంలో అటువంటి అనుమానాలే వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై పూర్తిస్థాయిలో సమీక్షించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. సెయిల్ (స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్) కడప ఉక్కుపై అధ్యయనం చేసి ఇది ఆర్థికంగా నష్టదాయకమని పేర్కొనడంతో కడప ఉక్కుకు తొలి అడ్డంకి ప్రారంభమైంది. దీనిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2015లోనే ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ ఎనిమిది సార్లు సమావేశమై 2019లో కేంద్రానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదికలో ప్లాంట్‌కు 200 కిలోమీటర్ల పరిధిలోనే ఇనుప ఖనిజాన్ని సమకూర్చాలని, అదనపు వ్యయం లేకుండా ఖనిజాన్ని సరఫరా చేయాలని భూ సేకరణను కూడా సబ్సిడీతో కూడిన ధరకు సమకూర్చాలని, స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇవ్వాలంటూ చేసిన సూచనలు కాగితాల్కుఏ పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎపి హైగ్రేడ్ స్టీల్స్ లిమిటెడ్ సమన్వయంతో కడప జిల్లాలో 3 ఎంపిటిఏ సామర్థ్యంగల ప్లాంట్‌ను ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థతో 5 మిలియన్ టన్నులు సరఫరా కోసం ఒప్పందం కూడా చేసుకున్నారు. మైలవరం రిజర్వాయర్ నుంచి రెండు టిఎంసిల నీటిని కూడా ఖరారు చేసుకున్నారు. ప్రాథమిక పనులు పూర్తికావడంతో కేంద్రం నుండి రావాల్సిన సాయం కోసం ప్రభుత్వం ఎదురుచూస్తోంది. అనంతపురం జిల్లాలోని సిద్ధాపురంలో ఉన్న మూడు గనులను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థకు కేటాయించాలంటూ రాసిన లేఖపై కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సిఉంది. అలాగే కేంద్ర వాటాలోని సిజిఎస్‌టి, ఐజిఎస్‌టికి సంబంధించి 20 ఏళ్లపాటు జిఎస్‌టిని రీయింబర్స్ చేయాలని రాష్ట్రం కోరుతోంది. ఆదాయపు పన్నులో కూడా 20 ఏళ్లపాటు రీయింబర్స్ చేయాలని, కేపిటల్ గూడ్స్‌పై దిగిమతి సుంకాన్ని వాపసు ఇవ్వాలని కూడా రాష్ట్రం కేంద్రాన్ని కోరింది. వీటిపై సానుకూల నిర్ణయాల కోసం కేంద్రానికి మరోసారి విజ్ఞప్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

నారాయణ బెయిల్‌పై సెషన్స్ కోర్టులో తేల్చుకోవాలి : హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

టెన్త్ ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో మాజీ మంత్రి నారాయణ బెయిల్ రద్దు వ్యవహారంలో కేసు పూర్వాపరాల ఆధారంగా తిరిగి విచారణ జరపాలని సెషన్స్ కోర్టుకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సెషన్స్ కోర్టులో నారాయణ పిటిషన్ దాఖలు చేయడాన్ని సమర్థించింది. మేజిస్ట్రేట్ ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేస్తూ సెక్షన్స్ కోర్టు ఉత్తర్వులను రద్దు చేసింది. కేసు పూర్వపరాల్లోకి వెళ్లకుండా ఉత్తర్వులు జారీ చేసిందని తప్పుపట్టింది. ఈ మేరకు జస్టిస్ రావు రఘునందన్‌రావు మంగళవారం తీర్పు చెప్పారు. టెన్త్ పేపర్ల లీకేజీ కేసులో నారాయణను పోలీసులు అరెస్టు చేసి మేజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చారు. రిమాండ్‌కు పంపేందుకు మేజిస్ట్రేట్ నిరాకరించారు. దీంతో నారాయణకు బెయిల్ లభించింది. దీనిని సవాల్‌చేసిన పోలీసులు సెషన్స్ కోర్టులో వేసిన కేసులో బెయిల్‌ను రద్దు చేసింది. దీనిపై నారాయణ హైకోర్టును ఆశ్రయించారు. సెషన్స్ కోర్టు 4 వారాల్లోగా నారాయణ బెయిల్ వ్యవహారంపై విచారణ చేసి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది.

यूनियन बैंक ऑफ इंडिया | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)

పోరంకి బ్రాంచి
టివిఆర్ కాలనీ, పోరంకి, విజయవాడ.
కృష్ణా జిల్లా. ఆంధ్రప్రదేశ్ - 521137

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(RULE 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరస్ట్ చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోరంకి బ్రాంచి** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13 (12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత : శ్రీ కర్నాటి దుర్గారావు,** తండ్రి : రాఘవులు, డోర్ నెం. 115/సి, దగ్గరి డోర్ నెం. 3-456, ఉండవల్లి జామ్ ఆయిల్ తోట రోడ్డు, ఫస్ట్ ఫ్లోర్ బిల్డింగ్, ఉండవల్లి గ్రామం & ఉండవల్లి ఎస్ఆర్ఓ. **2) శ్రీమతి కర్నాటి పుష్ప, (సహ ఋణగ్రహీత),** భర్త : శ్రీ కర్నాటి దుర్గారావు, డోర్ నెం. 115/సి, (దగ్గరి డోర్ నెం. 3-456), ఉండవల్లి జామ్ ఆయిల్ తోట రోడ్డు, ఫస్ట్ ఫ్లోర్ బిల్డింగ్, ఉండవల్లి గ్రామం & ఉండవల్లి ఎస్ఆర్ఓ, గుంటూరు జిల్లా వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 26,59,110.03/- (అక్షరాలా ఇరవై ఆరు లక్షల యాభై తొమ్మిది వేల నూట పది రూపాయల మూడు పైసలు మాత్రమే)** నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేది. 01-09-2022న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూలు 8 ప్రకారము **తేది. 02-12-2022** న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవిలు జరుపరాదని, ఎటువంటి లావాదేవిలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 26,59,110.03/- (అక్షరాలా ఇరవై ఆరు లక్షల యాభై తొమ్మిది వేల నూట పది రూపాయల మూడు పైసలు మాత్రమే)** + వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జీకి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. (డిమాండ్ నోటీసు జారిచేసిన తరువాత చెల్లించినవి మినహాయించవలయును).

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుభందమైన సబ్ సెక్షన్ (8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్, ఉండవల్లి గ్రామం & పంచాయితీ, ఉండవల్లి జామ ఆయిల్ తోట రోడ్డు, డి.నెం. 115/సి, దగ్గరి డి.నెం. 3-456 వద్ద మొత్తం 103.685 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము నందు అవిభక్త లేదా పేర్కొనబడని వాటా 51.84 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఇంటి స్థలము అందలి ఫస్ట్ ఫ్లోర్ ఆర్‌సిసి నివాస భవనం. **హద్దులు : తూర్పు :** విక్రేతలకు చెందిన ఆస్తి, **దక్షిణం :** విక్రేతలకు చెందిన ఆస్తి, **పడమర :** మున్నంగి ప్రకాష్ రెడ్డి మరియు ఇతరులకు చెందిన ఆస్తి, **ఉత్తరం :** 18 అ॥ వెడల్పు గల జాయింట్ రోడ్డు.

తేది : 02-12-2022
స్థలం : పోరంకి

సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అరటి రైతు దిగాలు

సగానికిపైగా పడిపోయిన ధర

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అరటి ధరలు నేలను తాకడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన మార్కెట్లలో రైతుల నుంచి అరటి గెల రూ.80 నుంచి రూ.100కు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. ఈ ఏడాది గోదావరి వరదలు అరటి రైతులను నట్టేట ముంచాయి. అరటి చెట్లు కూలిపోవటం, తెగుళ్ల విజృంభణతో దిగుబడులు పడిపోయాయి. కార్తీక మాసంలో కొద్దిగా డిమాండ్ పెరిగి ధరలు ఆశాజనకంగా ఉండడంతో కాస్తంత ఊరట లభించింది. సీజన్ ముగియడంతో ధరలు మళ్లీ నేలను తాకాయి. అరటి గెలలు నిల్వ చేసే సౌకర్యాలు లేకపోవడంతో ఎప్పుడు కోసిన గెలలు అప్పుడే అమ్ముకోవాల్సి వస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 45 వేల ఎకరాల్లో సాగు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 45 వేల ఎకరాల్లో అరటిని సాగు చేస్తున్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, అంబాజీపేట మండలాల్లో విస్తారంగా సాగవుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం, తాళ్లపూడి మండలాలతో అరటి సాగు అధికంగా ఉంది. కర్పూర, తెల్ల చక్రకేళి, కూర అరటి రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్షంగా 25 వేల మంది రైతులు, పరోక్షంగా ఐదు వేల మంది హోల్‌సేల్ రిటైల్ వ్యాపారులు అరటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

ఎగుమతి చేస్తున్న అరటి గెలలు

ప్రధాన మార్కెట్లకు ప్రతి రోజూ సుమారు 300 లారీల అరటి వస్తోంది.

రైతుల నుంచి గెల రూ.80 నుంచి రూ.100కు కొనుగోలు

ప్రస్తుతం కోనసీమలోని రావులపాలెం, తూర్పుగోదావరిలోని పెరవలి మార్కెట్లలో పది టన్నుల అరటి గెలలను రైతుల నుంచి వ్యాపారులు రూ.65 వేలకు కొనుగోలు చేస్తున్నారు. టన్నుకు సైజును బట్టి 60 నుంచి 70 వరకూ గెలలు పడతాయి. ఈ లెక్కన గెల ఒక్కటికి రూ.80 నుంచి రూ.100 లోపుగానే ధర పలుకుతోంది. కార్తీక మాసం ప్రారంభంలో పది టన్నులకు రూ.1.20 లక్షల వరకూ ధర పలికింది. గెలకు రూ.200 వరకూ ధర లభించింది. ఎకరా విస్తీర్ణంలో అరటి సాగుకు సుమారు రూ.50 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. అరటి చెట్టు పడిపోకుండా వెదురు గెడల ఏర్పాటు ఖర్చు దీనికి అదనం. ఒక్కొక్క వెదురు గెడ ఖరీదు సుమారు రూ.100 వరకు ఉంటోంది. ఎకరానికి 400 వెదురు గెడలకు రూ.40 వేలు అదనపు ఖర్చవుతోంది. ఎకరాకు సుమారు 500 వరకు గెలలు దిగుబడి వస్తోంది. గెల రూ.200కు పైగా అమ్మితే రూ.లక్ష వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం గెలకు వంద రూపాయలలోపే ధర వస్తోంది.

అప్పులే మిగులుతున్నాయి

అరటి రైతులకు అప్పులే మిగులుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల తెగుళ్లు ఆశించడం, దిగుబడులు తగ్గిపోవడం పరిపాటిగా మారింది. సీజన్‌లో 20 రోజులు మాత్రమే ధరలు ఉంటున్నాయి. మిగిలిన రోజుల్లో పది టన్నుల గెలలకు రూ.65 వేలు మించట్లేదు. అరటిని నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలి.

- నందమూరి నారాయణరావు, అరటి రైతు, తీపర్రు, పెరవలి మండలం

సిఎస్‌ను కలిసిన సమాచార కమిషనర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని సమాచార కమిషనర్లు మంగళవారం నాడు మర్యాద పూర్వకంగా కలిశారు. పలు అంశాలపై ఆయనతో చర్చించారు. సిఎస్‌ను కలిసిన వారిలో చీఫ్ కమిషనర్ మహబూబ్ భాషా, కమిషనర్లు బి.వి.రమణకుమార్, కట్టా జనార్ధనరావు, ఐలాపురం రాజా, రేపాల శ్రీనివాసరావు, యు.హరిప్రసాదరెడ్డి, కె.చెన్నారెడ్డి, శామ్యూల్ జొనాథన్, కమిషన్ కార్యదర్శి సాంబశివరావు ఉన్నారు.

ఆటో డ్రైవర్ దారుణ హత్య

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

ఆటో డ్రైవర్ దారుణ హత్యకు గురైన ఘటన చిత్తూరు నగర శివారు ప్రాంతమైన సీతం ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ... బాలాజీ కాలనీ అంబేద్కర్ నగర్‌కు చెందిన వడివేలు (45) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి ఆటోలో బయటికి వెళ్లిన ఆయన రాత్రి ఇంటికి రాలేదు. సీతం ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి వెళ్లి పోలీసులు పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా మృతుడు వడివేలుగా నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

చెరువులో పడి తండ్రీకుమారుడి మృతి

ప్రజాశక్తి - ఓజిలి

ప్రమాదవశాత్తు చెరువులో పడి తండ్రీకొడుకు మృతి చెందిన ఘటన తిరుపతి జిల్లా ఓజిలి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మాజీ సర్పంచ్ అలిమేలి చెంచయ్య (69) సోమవారం తన పశువులను మేత కోసం తీసుకెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. భయాందోళనకు గురైన కుటుంబసభ్యులు బెంగళూరులో పనిచేస్తున్న చిన్నకుమారుడు నాగార్జున (32)కు సమాచారమిచ్చారు. మంగళవారం ఉదయం గ్రామానికి చేరుకున్న నాగార్జున తన తండ్రి కోసం వెతకసాగాడు. చెరువుగట్టుపైన ఉన్న తన తండ్రి దుస్తులను చూసి చెరువులోకి దిగాడు. అప్పటికే పూడికలో కూరుకుపోయి చెంచయ్య మరణించారు. ఇది తెలియని నాగార్జున కూడా పూడికలో కూరుకుపోయి మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో వారు తండ్రీకొడుకుల కోసం చెరువులో గాలించారు. పూడికలో కూరుకుపోయి మృతిచెందిన తండ్రీకొడుకులను ఒడ్డుకు చేర్చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉద్యమాల ప్రతిబింబం ఫొటో ఎగ్జిబిషన్

- ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దశాబ్దాల ఉద్యమ చరిత్రను ప్రతిబింబించేలా ఫొటో ఎగ్జిబిషన్ ప్రదర్శించడం అభినందనీయమని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ సందర్భంగా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని కుంజా బొజ్జి, సున్నం రాజయ్య స్మారక ప్రాంగణంలో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ దేశంలో జరిగిన వివిధ సామాజిక ఉద్యమాలు, కార్మిక కర్షక ఐక్యతపై ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విశాఖ ఉక్కు సాధన కోసం జరిగిన పోరాటం నేటి సమాజానికి ఆదర్శంగా ఈ ఫొటో ఎగ్జిబిషన్ ఉపయోగపడుతుందని తెలిపారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాల రద్దు కోసం జరిగిన రైతాంగ పోరాటం చారిత్రాత్మకమైందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్, ప్రయివేట్ వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం దారదత్తం చేస్తోందని తెలిపారు. సామజిక స్పృహ, పోరాట స్ఫూర్తిని పెంపొందించేలా ఈ ఫొటో ఎగ్జిబిషన్ దోహదం చేస్తుందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలి, భూపోరాటాలతోపాటు కరోనా విపత్కర కాలంలో సేవా కార్యక్రమాలు నిర్వహించిన తీరు బాగుందన్నారు. అనంతరం చిరంజీవి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సాబ్జీ, హాస్పిటల్ డాక్టర్ కె.వంశీకృష్ణ ప్రారంభించారు. నిరంతరం అనేక పోరాటాలే కాకుండా సంఘం నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య చూపిన సేవా కార్యక్రమాలు కొనసాగింపుగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం కార్యదర్శి ఎ.రవి, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ గుడిపాటి నరసింహారావు, సిఐటియు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

రేషన్ డీలర్లకు ఉపాధి భద్రత కల్పించాలి

- సిఎంకు మాజీ ఎంపి మధు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రేషన్ డీలర్ల ఉపాధికి భద్రత కల్పించాలని మాజీ ఎంపి మధు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సిఎంకు రాసిన లేఖను మంగళవారం మీడియాకు విడుదల చేశారు. అథెంటికేషన్‌తో డోర్ డెలివరీ చేసే విధానం కావాలని డీలర్లు కోరుతున్నారని తెలిపారు. ఇప్పటికే పంచదార, నూనె వగైరా నిత్యావసర సరుకుల సరఫరా ఆపేశారని, ప్రస్తుతం బియ్యం వరకే పంపిణీ జరుగుతోందని పేర్కొన్నారు. డీలర్ల మార్జిన్ బాగా తగ్గిపోయిందని, మధ్యాహ్న భోజన బియ్యం బిల్లుల బకాయిలు ఏళ్ల తరబడి చెల్లించలేదని తెలిపారు. ఇంటింటికీ సరఫరా విధానం వల్ల, నాన్ పిడిఎస్ సరుకులు అమ్ముకునే విధానం ఆగిపోయిందని, ఖాళీ గోనె సంచులూ లాగేసుకొన్నారని, దీనివల్ల డీలర్ల ఉపాధి ప్రమాదంలో పడిందన్నారు. డీలర్లకు కూడా సంక్షేమ విధానాలు వీరికీ వర్తింపజేయాలని కోరారు. ప్రజాపంపిణీ వ్యవస్థ రక్షణతోపాటు వారి జీవనోపాధిని పరిగణనలోకి తీసుకుని, వెంటనే డీలర్లతో చర్చించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

ఎనిమిదేళ్లలో ఇవి రంగానిదే ఆధిపత్యం

బెంగళూరు : వచ్చే 2030 నాటికి విద్యుత్ వాహనాలు (ఇవి) దేశంలో డీజిల్, పెట్రోల్ వాహనాలను అధిగమిస్తాయని యుగొ ఇవి ఓ రిపోర్టులో అంచనా వేసింది. వచ్చే ఎనిమిదేళ్లలో చమురు ఇంధన కార్ల సంఖ్యను ఎలక్ట్రిక్ వాహనాలు అధిగమిస్తాయని 66 శాతం మంది అభిప్రాయపడ్డారని తెలిపింది. 57 శాతానికి పైచిలుకు వినియోగదారులు ఈ రంగం వాహనాలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారని పేర్కొంది. పర్యావరణానికి హాని చేయని వాహనాలను వాడాలని యోచిస్తున్నామని 56 శాతం మంది తమ 'టెక్నాలజీ-ఫస్ట్ అకో - యుగొ ఇండియా" విడుదల చేసిన రిపోర్టులో తేలినట్లు పేర్కొంది. కాగా.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు విద్యుత్తు వాహనాలకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా లేవని 60 శాతం మంది పేర్కొనడం గమనార్హం.

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
డోర్ నం.31-31-21, సాయిబాబా వీధి, బాబా గార్డెన్స్, విశాఖపట్నం

O.A. No. 598 /2022

వీరి మధ్య:
మెసర్స్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇండియా లిమిటెడ్, ప్రతినిధియైన దీని అధీకృత అధికారి, సికింద్రాబాద్ ...దరఖాస్తుదారు

మరియు

1. మెసర్స్ కేశవ ఎంటర్‌ప్రైజెస్ మరియు ఇద్దరు ఇతరులు. ...ప్రతివాదులు

ప్రతివాదులు 1 మరియు 2 ల చిరునామా:
1. **మెసర్స్ కేశవ ఎంటర్‌ప్రైజెస్, (ప్రతినిధియైన దీని యజమాని శ్రీ వీరపనేని కేశవ నారాయణ), తండ్రి శ్రీ ఆది నారాయణ,** వీరి ఆఫీసు: డోర్ నం.3-28-5, 1వ లేన్, 2వ క్రాస్, బృందావన్ గార్డెన్స్, గుంటూరు, ఆం.ప్ర.-522006.
2. **శ్రీమతి వీరపనేని సునీత, భర్త శ్రీ కేశవ నారాయణ వీరపనేని,** ఫ్లాట్ నం.104, స్వాతిసాయి క్లాసిక్ రామానుజకుంటం, కృష్ణా నగర్, గుంటూరు, ఆం.ప్ర.-522006.

పత్రికా ప్రకటన ద్వారా ప్రతివాదులకు సమ్మన్స్ ఈ విధంగా ఇవ్వబడుచున్నవి.
ఏదైతే, దరఖాస్తుదారు ప్రస్తుత మరియు తదుపరి వడ్డీ& ఇతర ఖర్చులతోపాటు దానిపై పేర్కొన్న మొత్తాలను రికవరీచేయుట కొరకు మీ పై రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్& ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ యాక్ట్, 1993 యొక్క సెక్షన్ 19 క్రింద దరఖాస్తును ప్రవేశపెట్టుట జరిగింది.
క్లెయింకు జవాబు ఇచ్చుటకు **20.12.2022**న ట్రిబ్యునల్‌కు సమాచారం ఇచ్చుటకు అనుసరించి వెంటనే **ఉ॥ 10.30గం.లకు** లేదా అట్టి సమయం లోగా ఈ ట్రిబ్యునల్ సమక్షంలో హాజరై మరియు వ్రాతపూర్వకంగా నివేదిక ఇవ్వగలరు.
ట్రిబ్యునల్ సమక్షంలో మీ హాజరు పై అనుబంధంగా సమ్మన్స్‌ను సేకరించవలసిందిగా ఇందుమూలంగా మిమ్ములను కోరబడుచున్నది.
ఒకవేళ మీరు ఏవేని పత్రాలను దాఖలుచేయ దలచినచో, మీరు దానిని వ్రాతపూర్వక నివేదికతోపాటు జాబితాగా ఫైల్‌చేయవచ్చును.
మీరు పేర్కొన్నట్లుగా స్వయంగా లేదా ప్లీడర్/అడ్వకేట్ ద్వారా గాని ట్రిబ్యునల్ సమక్షంలో ప్రవేశించి అగుపించుటకు మీ రిజిస్టర్డు చిరునామా మరియు హాజరు మెమోను మీరు ఫైల్‌చేయాలి.
సదరు తేదీ మరియు సమయంన ట్రిబ్యునల్ సమక్షంలో మీరు హాజరు అగుటలో డిఫాల్టిచెందినట్లైతే, మీ గైర్హాజరులో వాదనలు విని తీర్పుచెప్పబడుతుందని దయచేసి గమనించండి.
(నా స్వహస్తాలతో ఈ ట్రిబ్యునల్ సీలు వేసి 24 నవంబర్, 2022న ఇవ్వబడినది)

సం/-
అధికారి సంతకం
సమ్మన్స్ జారీచేసిన అధికారి
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
విశాఖపట్నం 530020.

इंडियन बैंक Indian Bank
इलाहाबाद ALLAHABAD
జోనల్ ఆఫీస్, విజయవాడ.
26-25-25, యన్.ఆర్.పి రోడ్డు, గాంధీనగర్, విజయవాడ-520003.
ఫోన్: 0866-2578762.

స్వాధీనత ప్రకటన
APPENDIX IV (రూలు-8(1) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం ఇండియన్ బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 8 మరియు 9 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీత: 1) శ్రీమతి దార్ల జయలక్ష్మీ,** తండ్రి: దార్ల చిన్న పుల్లయ్య, 5-21/ఏ, చనుపల్లివారి గూడెం, సూరంపల్లి, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521212. **2) శ్రీ గుడిమళ్ళ శశిధర్, తల్లి: శ్రీమతి దార్ల జయలక్ష్మీ,** 5-21/ఏ, చనుపల్లివారి గూడెం, సూరంపల్లి, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521212. **వారు ఇండియాన్ బ్యాంక్, నున్న బ్రాంచి వారికి** (ఐ.బి హోమ్ లోన్ - అకౌంట్ నెం.7046023752 క్రింద రూ. 14.37 లక్షలు, 2) ఇండ్ కవచ్ హెచ్.యల్ అకౌంట్ నెం.7046181380 క్రింద రూ.1.79 లక్షలు, 3) హెచ్.యల్ ఓమెన్ శాలరి అకౌంట్ నెం.7032196085 క్రింద రూ.11.90 లక్షలు) మొత్తం **రూ.28,06,000/- (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల ఆరు వేల రూపాయలు మాత్రమే)** తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.16-09-2022న** డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీతలు బకాయి సొమ్ము చెల్లించడంలో విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 మరియు 9 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.01-12-2022న** స్వాధీనత తీసుకోవడమైనది. ఋణగ్రహీతకు / హామీదారుకు / చట్టపరమైన వారసులను మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ఇచ్చి తెలియజేయడమైనది.

సదరు ఆస్తికి సంబంధించి ఏ విధమైన లావాదేవిలు జరుపరాదని, ఏవేని లావాదేవిలు **ది.30-11-2022** నాటికి బకాయి మొత్తం **రూ.28,06,000/- (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల ఆరు వేల రూపాయలు మాత్రమే)** తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు **ఇండియన్ బ్యాంక్,** వారి ఛార్జీలకు లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీత/హామీదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది.

SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13(8)లోని నిబంధనలను మరియు దాని పై రూపొందించిన నిబంధలను దృష్టిలో ఉంచుతాము. ఇది ఋణగ్రహీత సెక్యూరిటీలపై విముక్తిపొందే హక్కులతో వ్యవహరిస్తుంది.

స్థిరాస్తి వివరములు
ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, గన్నవరం మండలం, సూరంపల్లి శివారు, మాదలవారిగూడెం గ్రామం & పంచాయతి, ఆర్.యస్.నెం.26/12, యస్.నెం.2-156, అసెస్మెంట్ నెం.356, ప్లాట్ నెం.65లో 140 చ॥గ॥లలో గల ఆర్.సి.సి నివాస భవనం శ్రీమతి దార్ల జయలక్ష్మీ గారికి చెందినది ఈ దిగువ హద్దులలో **తూర్పు:** ప్లాట్ నెం.72, **దక్షిణం:** ప్లాట్ నెం.42, **పడమర:** 33 అడుగుల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం.65.

తేది: 01-12-2022 — **ఆధీకృత అధికారి**
ప్రదేశం: నున్న — **ఇండియన్ బ్యాంక్**

మా సమస్యలు పరిష్కరించాల్సిందే..

మహా పాదయాత్ర నిర్వహిస్తున్న ఎన్ఎఒబి నిర్వాసితులు

- ఎన్ఎఒబి నిర్వాసితుల మహా పాదయాత్ర

ప్రజాశక్తి - రాంబిల్లి (అనకాపల్లి)

తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేటింగ్ బేస్ (ఎన్ఎఒబి) నిర్వాసితులు మంగళవారం మహా పాదయాత్ర చేపట్టారు.అనకాపల్లి జిల్లా ఎన్ఎఒబి గేటు నుంచి రాంబిల్లి తహశీల్దారు కార్యాలయం వరకూ సుమారు ఐదు కిలోమీటర్ల మేర సాగిన ఈ పాదయాత్రలో వేలాది మంది పాల్గొన్నారు. నిర్వాసిత గ్రామాలైన కొత్తపట్నం, వాడనర్సాపురం, కెజె పాలెం, నేవీ కాలనీ, చినకలవలపల్లి, కొత్తపేట, గోవిందపాలెం, వాడపాలెం గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజానీకం తమ సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినదించారు. మత్స్యకారులకు ఫిషింగ్ జెట్టీ నిర్మించాలని, పెండింగ్ ప్యాకేజీలు ఇవ్వాలని, నేవీ నిర్మాణ పనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని, ప్రభుత్వ గుర్తింపునకు నోచుకోని నాలుగు గ్రామాల్లోని ప్రజలను నేవీ నిర్వాసితులుగా పేర్కొని ప్యాకేజీలు ఇవ్వాలని, పునరావాస కాలనీలో మేజర్లుకు ఐదు సెంట్లు ఇళ్ల స్థలం, మహిళలకు గంపల ప్యాకేజీ కింద రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహా పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి కె లోకనాథం మాట్లాడుతూ 37 రోజుల నుంచి ఎనిమిది గ్రామాల నిర్వాసితులు ఉద్యమం నిర్వహిస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దేశ రక్షణ అవసరాల కోసం భూములు, ఇళ్లు, నదులను త్యాగం చేసిన నిర్వాసితులపై నిర్లక్ష్యం తగదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్ఎఒబికి కేటాయించాల్సిన నిధులను సక్రమంగా ఇవ్వకపోవడంతో ఈ సమస్య తలెత్తిందన్నారు. గతంలో నిర్వాసితులు పోరాడిన సందర్భాల్లో చేసుకున్న ఒప్పందాలను సైతం తుంగలో తొక్కారని తెలిపారు. కేంద్రం ప్రభుత్వం, రాష్ట్రం ప్రభుత్వం ఒకదానిపై మరొకటి తప్పులను నెట్టుకుంటూ నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు జరిపి నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ భాగ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ నిర్వాసితుల పోరాటానికి టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ మాధవ్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు నిర్వాసితుల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. సిపిఎం మండల కార్యదర్శి దేముడు నాయుడు, టిడిపి జిల్లా నాయకులు లాలం భాస్కరరావు, నిర్వాసిత గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

రాళ్లతో కొట్టి హత్య

ప్రజాశక్తి-కదిరి టౌన్

శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. వాషింగ్ మిషన్ నుంచి వెళ్తున్న వృథా నీటి విషయంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. కదిరి పట్టణంలోని మశానంపేట కాలనీలో పద్మావతి బాయి, మనోజ్ కుమార్ దంపతులు నివసిస్తున్నారు. పద్మావతిబాయి ఇంట్లోని వాషింగ్ మిషన్ నుంచి వచ్చే వృథా నీరు పక్కనే ఉన్న వేమన్న నాయక్ ఇంటి ముందుకు వెళ్లాయి. ఈ విషయంలో రెండు కుటుంబాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో పద్మావతిపై ఇనుప రాడ్డు, బండరాళ్లతో వేమన్న నాయక్, ఆయన కుమారుడు ప్రకాష్‌నాయక్ దాడిచేశారు. దీంతో ఆమె ముఖం, తలపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు పద్మావతిని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళు తుండగా మార్గ మధ్యంలో ఆమె మరణించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్ర జెండాలతో ముస్తాబైన జంగారెడ్డిగూడెం

వ్యకాస రాష్ట్ర మహాసభకు సన్నద్ధం

- హాజరు కానున్న 400 మంది ప్రతినిధులు, జాతీయ నేతలు
- 8న బహిరంగ సభలో పాల్గొనున్న గిరిజనోద్యమ నేత బృందాకరత్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఈ నెల 8, 9, 10 తేదీల్లో మూడు రోజులపాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభకు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ముస్తాబైంది. ఈ సభకు 350 మంది ప్రతినిధులు, 50 మంది ఆహ్వానితులు మొత్తం 400 మంది హాజరుకానున్నారు. రాష్ట్ర మహాసభ నేపథ్యంలో గ్రామాలు, మండల కేంద్రాల్లో వివిధ రూపాల్లో ఇప్పటికే విస్తృత ప్రచారం నిర్వహించారు. 29వ రాష్ట్ర మహాసభ సందర్భంగా ప్రతి మండలంలో 29 చోట్ల వ్యకాస జెండా ఆవిష్కరణలు చేశారు. మహాసభ నిర్వహణకు మొత్తం 12 కమిటీలను ఏర్పాటు చేశారు. మహాసభ నేపథ్యంలో మంగళవారం జంగారెడ్డిగూడెం బస్టాండ్ సమీపంలో సున్నం రాజయ్య, కుంజా బుజ్జి స్మారక ప్రాంగణంలో ఉచిత వైద్యశిబిరం, ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ దీన్ని ప్రారంభించారు. ఏడో తేదీ 'కూలోళ్ల ఆటపాట' కార్యక్రమం సాగనుంది. ఈ కార్యక్రమానికి అతిథిగా ప్రజాకవి గోరటి వెంకన్న, ప్రముఖ గాయకులు హాజరుకానున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణ శివార్లలోని దండమూడి రామలక్ష్మి కల్యాణ మండపంలో మూడు రోజులపాటు ప్రతినిధుల సభ జరగనుంది. తొలిరోజు జరిగే బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా గిరిజనోద్యమ జాతీయ నాయకురాలు, మాజీ ఎంపి బృందాకరత్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు ఎ.విజయరాఘవన్, ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, కేరళ ఎంపి శివదావన్, రైతు సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఉభయగోదావరి జిల్లాల శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొననున్నారు. మహాసభ నేపథ్యంలో జంగారెడ్డిగూడెం ప్రాంతమంతా ఎర్రజెండాలతో అరుణారుణమైంది.

గ్రూప్-1 పరీక్షా విధానంలో స్వల్ప మార్పులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ ఏడాది సెప్టంబర్ 30 విడుదల చేసిన గ్రూప్ 1 నోటిఫికేషన్‌లో మెయిన్ పరీక్షకు సంబంధించి జనరల ఎస్సే పేపర్-1 పరీక్ష విధానాన్ని మార్చారు. ఈ మేరకు ఎపిపిఎస్‌సి కమిషన్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మెయిన్ పరీక్షకు సంబంధించి ఏడు అంశాలు కలిపి వుండేవి. ఇపుడు ఆ ఏడు అంశాలను మూడు విభాగాలుగా విభజించారు. ఒకటో విభాగంలో కరెంట్ అఫైర్స్, రెండో విభాగంలో సామాజిక రాజకీయ అంశాలు, సామాజిక ఆర్థిక అంశాలు, సామాజిక పర్యావరణ అంశాలు ఉన్నాయి. మూడో విభాగంలో సాంస్కృతిక, చారిత్రాత్మక అంశాలు, పౌర అవగాహన అంశాలతో పరీక్షలు రాయాలి. అభ్యర్థులు ఒక్కొక్క అంశాన్ని 800 పదాలతో మూడు సెక్షన్ల నుండి ఒక్కో అంశాన్ని తీసుకుని పరీక్షను రాయాల్సి ఉంటుంది. ఒక్కో అంశానికి 50 మార్కులు వుంటాయి. పరీక్ష రాసే కాలవ్యవధి మూడు గంటలు వుంటుందని ఎపిపిఎస్‌సి తెలిపింది.

తపస్విని మృతదేహం తల్లిదండ్రులకు అప్పగింత

పెయింటర్‌గా పని చేస్తూ సాఫ్ట్‌వేర్‌నంటూ జ్ఞానేశ్వర్ మోసం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో సోమవారం రాత్రి హత్యకు గురైన డెంటల్ విద్యార్థిని తపస్వినీ మృతదేహానికి గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం తపస్విని తల్లిదండ్రులకు మృతదేహాన్ని అప్పగించారు. వారు మృతదేహాన్ని గన్నవరం తీసుకెళ్లి బంధువుల ఇంట్లో సందర్శనార్థం ఉంచారు. తొలుత జిజిహెచ్‌లో తపస్విని మృత దేహాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. ఆమె తండ్రి పిన్నమనేని మహేష్‌కుమార్ ముంబయిలో ఓ ప్రముఖ కంపెనీకి సిఇఒగా పని చేస్తుండగా తల్లి సీతారత్నం కార్పొరేట్ కళాశాలలో డీన్‌గా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె నిఖిత ఆస్ట్రేలియా లో ఉంటోంది. తపస్విని చిన్న కుమార్తె. తపస్వినీ తల్లిదండ్రులను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ పరామర్శించి ధైర్యం చెప్పారు.

మృతదేహం వద్ద విలపిస్తున్న తపస్విని తల్లిదండ్రులు, ఓదార్చుతున్న వాసిరెడ్డి పద్మ

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఘోర నేరాలకు పాల్పడుతున్న నిందితులకు కఠినమైన శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. తపస్విని హత్య ఘటన అందరి హదయాలను కలచి వేసిందన్నారు. ప్రేమ పేరుతో ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్‌ల ద్వారా పరిచయం అవుతున్న స్నేహాల పట్ల యువతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆమెవెంట డిప్యూటీ సూప రింటెండెంట్లు డాక్టర్ పద్మశ్రీ, సంధ్యావళి, సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్‌ఉన్నారు. నిందితుడు జ్ఞానేశ్వర్‌ను పెదకాకాని పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. నిందితుడ్ని కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. జ్ఞానేశ్వర్, తపస్వినికి ప్రేమ వ్యవహారంలో ఏర్పడిన విభేదాలే హత్యకు కారణం గా పోలీసులు నిర్ధారించారు. పెయింటర్‌గా పనిచేస్తున్నా జ్ఞానేశ్వర్... తపస్వినికి సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నట్టు నమ్మించాడు. నిజం తెలిసిన తపస్విని అతన్ని దూరం పెట్టింది. దీంతో ఆమెపై జ్ఞానేశ్వర్ కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో పరీక్షలకు సిద్ధమయ్యేందుకు తక్కెళ్లపాడు లోని తన స్నేహితురాలి వద్దకు తపస్విని వచ్చినట్లు తెలుసుకున్న జ్ఞానేశ్వర్ సోమవారం రాత్రి అక్కడకు వచ్చి ఆమెతో ఘర్షణ పడి సర్జికల్ బ్లేడుతో గొంతుకోసి హత్య చేశాడు.

మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
కార్పొరేట్ కార్యాలయము: సాధన హౌస్, 2వ అంతస్తు, 570 పి.బి.మార్గ్, వర్లి, ముంబాయి-400018,ఇండియా
రీజనల్ కార్యాలయము మరియు బ్రాంచి కార్యాలయము: డోర్ నెం.54-1/2డి, 4వ అంతస్తు, శ్రీ సూర్య ప్రీమియర్, వెటర్నరీ కాలనీ, గుణదల, ఎన్‌హెచ్-5 రోడ్డు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520008

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరస్ట్ యాక్ట్ 2002 (ఇప్పటి నుండి చట్టం అని పిలువబడుతుంది) యొక్క 13 (2) విభాగం పరిధిలో డిమాండ్ నోటీసు.

ఇందుమూలముగా మీకు సూచించునది ఏమనగా సాధన హౌస్, 2వ ఫ్లోర్, 570, పి.బి.మార్గ్, వర్లి, ముంబాయి-400 018 వద్ద కార్పొరేట్ కార్యాలయం కలిగియున్న సెక్యూర్డ్ క్రెడిటర్ మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇప్పటి నుండి MRHFL గా పిలువబడునది) వారిచే మీ రుణ ఖాతా NPA గా ప్రకటించటమైనది మరియు మీరు MRHFL వారి మీ రుణ ఖాతాకు సంభందించి బకాయి మొత్తము, ఇంకను మీరు దిగువ తెలిపిన మొత్తములపై ఒప్పందపు రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ మరియు సందర్భానుసారమైన ఖర్చులు, చార్జీలు వగైరా చెల్లించవలసి ఉన్నది. కనుక మీరు ఈ నోటీసు తేది నుండి 60 దినములలోగా MRHFL వారికి పూర్తి బకాయి మొత్తము చెల్లించవలసినదిగా కోరటమైనది, అట్లు చెల్లించనిచో సదరు చట్టం 13 (4) విభాగం పరిధిలో సంక్రమించిన అధికారాలతో MRHFL తగిన చర్యలు చేపడుతుంది. రుణగ్రహితలు మరియు సెక్యూర్డ్ ఆస్తుల వివరములు ఈ దిగువ సూచించటమైనది.

వ. నెం	రుణగ్రహీత పేరు/ సహ దరఖాస్తుదారు/ సహ రుణగ్రహీత	చిరునామా	బకాయి
1	రుణగ్రహీత **సురేష్ రెడ్డి**	సమీప డోర్ నెం:1-28, Rs No:121/6, ఫ్లాట్ నెం. F.F2, 1వ అంతస్తు, విజయదుర్గ రెసిడెన్సీ, బల్లెంవారివీధి,రామవరప్పాడు గ్రామపంచాయతీ, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520002 డోర్ నెం: 30-29-4బి, చుట్టుగుంట, 4వ వీధి, పాత ఎంప్లాయిమెంట్ స్ట్రీట్, విజయవాడ, విజయవాడ(అర్బన్), ఆంధ్రప్రదేశ్-520013	05.06.2022 నాటికి **రూ.13,18,191.00** నోటీస్ తేది : **01.07.2022**
2	సహ దరఖాస్తుదారు/ సహ రుణగ్రహీత **సంగమేశ్వరరావు రెడ్డి**	డోర్ నెం: 30-29-4బి, చుట్టుగుంట, 4వ వీధి, పాత ఎంప్లాయిమెంట్ స్ట్రీట్, విజయవాడ, విజయవాడ(అర్బన్), ఆంధ్రప్రదేశ్-520013	

సెక్యూర్డ్ / తనఖా ఆస్తి షెడ్యూల్
'ఎ' షెడ్యూలు
కృష్ణా జిల్లా, విజయవాడ తూర్పు జిల్లా రిజిస్ట్రార్ SRO, పరిధిలోని, గుణదల SRO, విజయవాడ గ్రామీణ మండలం, రామవరప్పాడు గ్రామ పంచాయతి, రామవరప్పాడు గ్రామం, R.సర్వే నెం. 121/6 నందలి 100 చ.గజముల విస్థీర్ణం కల భూమికి సరిహద్దులు : **తూర్పు :** దాసరి చిన లక్ష్మయ్య ఆస్తి, **దక్షిణం :** 4 అడుగుల వెడల్పు బజారు, **పడమర :** దాసరి సాంబశివ రావు ఆస్తి, **ఉత్తరం :** తుమ్మల కోటేశ్వరరావు ఆస్తి. ఈ సరిహద్దుల పరిధిలోని 100 చ. గజములు లేదా 83.61 చ.మీటర్లు నివేశన స్థలం అనిర్ధిష్టపు జాయింట్ హక్కు అనగా 13 చ. గజములు లేదా 10.86 చ.మీటర్లు స్థలం మరియు
'బి' షెడ్యూలు
పైన షెడ్యూలు-ఎ లో తెలిపిన మొత్తం స్థలం నందు నిర్మించిన విజయదుర్గ రెసిడెన్సీ, గ్రూపు హౌస్, మొదటి అంతస్థు ఫ్లాట్ నెం. ఎఫ్.ఎఫ్.-2 నకు సరిహద్దులు: **తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఫ్లాట్ నెం. ఎఫ్.ఎఫ్.-1 ఆస్తి, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై. ఈ సరిహద్దుల లోని 350 చ.అడుగుల ఫ్లాట్, 70 చ.అడుగుల కామన్ ఏరియా అన్ని ఎక్విప్మెంట్స్ తోటి, ద్విచక్ర వాహనం (టూ వీలర్) పార్కింగ్ 25 చ.అడుగులు, అటాచ్డ్ లెట్రీస్, బాత్ రూములు, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్ మరియు డ్రైనేజి కనెక్షన్, లిఫ్ట్, వాటర్, కామన్ మెట్లు, కామన్ సదుపాయము లందు ఉమ్మడి హక్కులు మరియు అందలి అన్ని సౌకర్యాల హక్కులు.

స్థలం: విజయవాడ — **అధీకృత అధికారి**
తేది: 01-07-2022 — **M/s. మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

సంపాదకీయం

అనర్హులకు ఓట్లు!

పెద్దల సభగా చెప్పబడే శాసన మండలికి జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో తీవ్రమైన అక్రమాలు చోటుచేసుకోవడం ఆందోళనకరం. రాష్ట్రంలో మూడు పట్టభద్రుల, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ ఎన్నికలకు తొలిమెట్టు ఓటర్ల నమోదు. ఓటర్లుగా అర్హులైన వారు నమోదైతేనే సరైన వారు ఎన్నికయ్యే అవకాశముంటుంది. ఓటర్ల జాబితాలే అనర్హులతో నిండిపోతే ఇక చట్టసభకు అర్హులైన వారిని ఎన్నుకోవడమెలా సాధ్యం? గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులను, వాలంటీర్లను మండలి ఎన్నికల్లో భాగస్వాములు చేయరాదని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలిచ్చినా ఓటర్ల నమోదుకు వారిని యథేచ్ఛగా వినియోగించారు. వారిపై ఒత్తిడి చేసి, లక్ష్యాలు నిర్ణయించి అక్రమ ఓటర్లను యథేచ్ఛగా నమోదు చేయించారు.

శాసనాల రూపకల్పనలో, ఆమోదంలో అసెంబ్లీ వేదికగా జరిగే తొందరపాటును, మందబలంతో పంతం నెగ్గించుకోవాలనే అధికార పార్టీ యత్నాలకు కొన్ని సందర్భాల్లో మండలి చెక్ పెడుతుంది. ప్రజాసమస్యలపై స్పష్టమైన అవగాహన ఉన్న మేధావులు ఎమ్మెల్సీలుగా ఎన్నికైతే అధికార పార్టీకి వంతపాడే పరిస్థితి ఉండదు. ఇది కంటగింపుగా మారడంతో పాలకవర్గ రాజకీయ పార్టీలు అటువంటి వారు ఎన్నిక కాకుండా చూసేందుకు అన్ని అడ్డదారులు తొక్కుతుంటాయి. అందులో అధికార పార్టీ ముందంజలో ఉంటుంది. ఓటుకు నోటు.. బిరియానీలు, మందు పార్టీలు... ఈ తంతు పంచాయతీ నుంచి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల వరకూ నడిపిస్తున్న పాలక పార్టీలు నేడు మండలి ఎన్నికల్లోనూ సాగిస్తున్నాయి. తొలుత అనర్హులను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు తమ అధికారాన్ని వినియోగిస్తున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో బోధన అంటేనే తెలీని వారిని, పట్టభద్రుల నియోజకవర్గాల్లో పదో తరగతి కూడా పాస్ కాని వారిని ఓటర్లుగా నమోదు చేసేస్తున్నారు. కడపలో ఒక ప్రయివేటు పాఠశాలలో 12 మంది ఉపాధ్యాయులుంటే, ఆ పాఠశాల పేరిట 40 మందిని నమోదు చేసెయ్యడం అక్రమాల తీవ్రతకు నిలువెత్తు నిదర్శనం. విశాఖ జిల్లా 210 పోలింగ్ బూత్‌లో 1489 మంది ఓటర్లలో ఒకరి పేరు నాలుగు సార్లు, మరొకరి పేరు మూడుసార్లు, 20 మంది పేర్లు రెండు సార్లు చేర్చేశారు. ఓటరు పేరులో స్పెల్లింగ్‌లో ఒక అక్షరం మార్చేసి పలుమార్లు నమోదు చేయడం, అటెస్టేషన్ లేకుండా అప్‌లోడ్ చేయడం, సర్టిఫికెట్లు మార్ఫింగ్ చేయడం... ఇలా అడ్డగోలు తంతుకు అంతే లేకుండా పోతోంది. అనంతపురం, నెల్లూరు డిఇఒల ఆకస్మిక బదిలీ ఇలాంటి అక్రమాలకు సహకరించకపోవడం వల్లేనని విమర్శలు వెల్లువెత్తాయి. తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలో ఈ నెల 5వ తేదీకి 1,98,695గా ఉన్న ఓటర్లు ఏడో తేదీ సాయంత్రానికి 2,81,301కి, అదే రోజు రాత్రి 12 గంటలకు 4,17,244కు పెరిగిపోయారు. ఇక్కడి ఉపాధ్యాయ నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి. విశాఖ జిల్లాలోనే తప్పుడు పేర్లున్న 2,163 మంది జాబితాను గుర్తించి, తొలగించాలని ఎన్నికల అధికారులకు పిడిఎఫ్ అభ్యర్థి మద్దతు దారులు అందజేశారు. మరోవైపు అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓట్లు నమోదు చేయకుండా మొండిచేయి చూపారు. రాజకీయ ఒత్తిళ్లతో చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ఎక్కువమంది అర్హులైన ప్రభుత్వ ఉపాధ్యాయుల ఓట్లను తిరస్కరించారనే విమర్శలు సరేసరి. కొన్ని గంటల వ్యవధిలోనే వేలాది ఓట్లు చేర్పించేయడం, అనర్హులకు ఓటు హక్కు కల్పించడం వంటి అక్రమాలు చోటుచేసుకుంటున్నా ఎన్నికల అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో వెరిఫికేషన్ చేయాలన్న ప్రజాస్వామిక వాదుల ఆకాంక్షను నెరవేర్చాలి. ఓటర్ల అప్లికేషన్లు, సర్వీసు/డిగ్రీ సర్టిఫికెట్లతోపాటు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచితేనే పారదర్శకత. ప్రైవేటు సంస్థల యాజమాన్యాలే బరిలో నిలిచి, అక్రమాలకు పాల్పడుతున్న తరుణంలో అన్ని ప్రైవేటు ఉపాధ్యాయుల, అధ్యాపకుల ఓట్లను పూర్తిస్థాయిలో పరిశీలించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. ఇందుకోసం జిల్లాకొక ఐఎఎస్ అధికారిని పరిశీలకునిగా నియమించడం అవసరం. ఓటు చాలా విలువైనది. అన్ని విధాల అర్హులకు మాత్రమే ఆ హక్కు దక్కాలి. అనర్హులు ఓటర్లయితే అయోగ్యులు అందలమెక్కుతారు. అది ప్రజాస్వామానికి చేటు.

మహనీయుల మాట

సంక్షోభంలో పడ్డ కార్పొరేట్ సంస్థలకు ప్రజల సొమ్ము ఇచ్చే బదులు...వాటిని ప్రజల నిర్ణయాధికారం కింద ఎందుకు వుంచకూడదు?

- డెన్నిస్ ప్రొటెర్,
హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో లైబ్రరీ అసిస్టెంట్, రచయిత.

కార్పొరేట్లపై అధిక పన్నులు వేస్తేనే సంక్షేమం సాధ్యం

ప్రజా ప్రస్థానం

ప్రభాత్ పట్నాయక్

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ముఖ్యంగా యూరప్ లోని సంపన్న పెట్టుబడిదారీ దేశాల ప్రభుత్వాలు ఆ నాడు సోవియట్ యూనియన్ లో అమలు జరుగుతున్న సంక్షేమ విధానాలను తామూ అనుసరించడం మొదలుబెట్టాయి. నిజానికి అటువంటి విధానాలకు పెట్టుబడిదారీ విధానం పూర్తిగా వ్యతిరేకం. అయినా వాటిని అవి ఆమోదించక తప్పలేదు. కారణం ఆ దేశాలు యుద్ధం కారణంగా బలహీనపడివున్నాయి. పైగా కార్మికవర్గ ఆగ్రహం పెల్లుబుకుతోంది. అంతేగాక తూర్పు యూరప్ వైపు నుండి సోషలిజం ప్రభావం విస్తరిస్తోంది. ఇన్ని విధాలుగా ప్రమాదంలో పడిన తన ఉనికిని కాపాడుకోడానికి ఆ సంపన్న పెట్టుబడిదారీ దేశాలు సంక్షేమ విధానాలను అనుసరించవలసి వచ్చింది. ఒకసారి పరిస్థితి మళ్ళీ పుంజుకున్న తర్వాత సంక్షేమ విధానాల పట్ల వాటికున్న వ్యతిరేకత మళ్ళీ బాహాటంగా బైటపడింది. ఆ సంక్షేమ చర్యలనన్నింటినీ రద్దు చేయడానికి ప్రయత్నించినా, కార్మికుల ప్రతిఘటన కారణంగా ఆ విషయంలో పెట్టుబడిదారీ వర్గం ఆశించిన మేరకు సంక్షేమ చర్యలను రద్దు చేయలేకపోయింది. మార్గరెట్ థాచర్ వంటి నాయకురాలు సైతం ఎంత ప్రయత్నించినా, బ్రిటన్ లోని జాతీయ ఆరోగ్య సేవల వ్యవస్థను రద్దు చేయలేకపోయింది. నిజానికి తాను ఏ చర్యలనైతే రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నదో, సరిగ్గా ఆ చర్యల కారణంగానే పెట్టుబడిదారీ వ్యవస్థ తన అసలైన, కొల్లగొట్టే స్వభావాన్ని కప్పిపుచ్చి, ప్రజల సంక్షేమం గురించి పాటుపడే వ్యవస్థగా తన ఉనికిని సమర్ధించుకోగలిగింది. అదే విచిత్రం.

ఒకసారి సంక్షేమ విధానాలను అమలు చేయడం మొదలుపెట్టాక, వాటిని అమలు చేయడం కోసం అంతకు ముందరి కాలంలో కన్నా, ఎక్కువ శాతం పన్నులు విధించాల్సి వచ్చింది. యూరప్ లోని దేశాలు విధించే పన్నులు ఆ దేశాల జిడిపిలతో పోల్చి చూసినప్పుడు తక్కిన ప్రపంచంలోని దేశాలకన్నా అధికంగా ఉన్నాయి. ఒక్క క్యూబాలో మాత్రమే అంతకన్నా అధికంగా పన్నులు ఉన్నాయి. ఆ దేశంలో అమలు జరిగే సంక్షేమ విధానాలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయి.

కమ్యూనిస్టు దేశాలు సంక్షేమం కోసం అధిక పన్నులు వసూలు చేయడం ఎవరికీ ఆశ్చర్యం కలిగించదు. కాని ఇప్పటికీ పశ్చిమ యూరప్ దేశాలు అధిక శాతం పన్ను వసూలు చేయడం చెప్పుకోదగ్గ విషయం. పన్ను-జిడిపి నిష్పత్తి రీత్యా అందరికన్నా అధికంగా 46.2 శాతంతో ఫ్రాన్స్ ముందున్నది. డెన్మార్క్ (46.0), బెల్జియం (44.6), స్వీడెన్ (44.0), ఫిన్లాండ్ (43.3), ఇటలీ (42.4), ఆస్ట్రియా (41.8) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. రాజ్యంలో సంక్షేమం నడవాలంటే భారీగా పన్నులు విధించక తప్పదు. అంటే మార్కెట్ ద్వారా జరిగే ఆదాయ పంపిణీ క్రమంలో ప్రభుత్వం బలంగా జోక్యం చేసుకోవలసిందే.

ఈ రోజు ప్రపంచంలో జిడిపి రేటు వేగంగా వృద్ధి చెందుతున్న దేశాల సరసన ఈ యూరప్ దేశాలు ఏవీ లేవు. నిజానికి రెండో ప్రపంచ యుద్ధం తర్వాత దశాబ్దాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ వేగంగా పెరుగుతూ వచ్చిన ఆ "పెట్టుబడిదారీ స్వర్ణయుగం" కాలంలో సైతం ఈ యూరప్ దేశాల జిడిపి అంత గొప్పగా వృద్ధి చెందినదేమీ లేదు. పైగా, 2008లో హౌసింగ్ బబుల్ పేలిపోయిన తర్వాత ఈ దేశాల జిడిపి మరీ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఐనప్పటికీ, పన్ను-జిడిపి నిష్పత్తి తక్కిన దేశాల కన్నా అధికంగా కొనసాగుతోంది.

మనది చాలా వేగంగా వృద్ధి చెందుతున్న దేశం అని అధికారులు చాలా గొప్పలు చెప్పుకుంటున్నారు. కాని ఇక్కడ ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ చర్యలు చాలా హీన స్థాయిలోనే కొనసాగుతున్నాయి. నిజానికి మన దేశానికి సంబంధించి పన్ను-జిడిపి నిష్పత్తి కేవలం 18.08 మాత్రమే. అంటే సంక్షేమం అమలు చేసే దేశాలలో చాలా దిగువన మనం ఉన్నాం.

పై వివరాలన్నీ పరిశీలిస్తే మూడు సంగతులు స్పష్టం ఔతున్నాయి. మొదటిది: జిడిపి వృద్ధి రేటు బాగా ఎక్కువగా ఉంటే దాని కారణంగా పోగుబడే సంపద దిగువకు ప్రవహిస్తుంది అన్న సిద్ధాంతం పూర్తిగా డొల్ల అని తేలిపోయింది. ఏ విధమైన నియంత్రణా లేకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగితే దాని వలన అత్యధిక ప్రజానీకపు సంక్షేమం ఏ విధంగానూ మెరుగుపడదు. పెట్టుబడిదారీ వ్యవస్థ తన మనుగడ కొనసాగించాలంటే అందుకు కార్మికుల రిజర్వు సైన్యం - అంటే నిరుద్యోగులు - ఉండడం తప్పనిసరి. నిరుద్యోగం ఉంటేనే కార్మికుల జీతాలను తక్కువ స్థాయిలో ఉంచవచ్చు. వేతనాలు ఎంత తక్కువ స్థాయిలో ఉంటే పెట్టుబడిదారులకు దక్కే అదనపు విలువ అంత ఎక్కువగా ఉంటుంది. శ్రామికవర్గ ఉత్పాదకత ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎక్కువ వాటా పెట్టుబడిదారులకూ, వారి తాబేదారులకూ అందుతుంది. ఆ ఉత్పాదకతకు కారణమైన కార్మికవర్గానికి దక్కే వాటా మాత్రం తగ్గిపోతూ వుంటుంది. ఒకవేళ ఎక్కడైనా కార్మికవర్గం బలంగా పోరాడి మెరుగైన వేతనాలను సాధించుకుంటే అక్కడ ప్రభుత్వాలు ఆ వేతనాలను చెల్లించడానికి తాము విధించే పన్నుల శాతాన్ని పెంచడం అనివార్యం ఔతుంది. అంటే ఎక్కడైనా కార్మికవర్గం పోరాడి మెరుగైన వేతనాలను సాధించుకోవలసిందే తప్ప జిడిపి వృద్ధి బాగా ఉండినందువలన వారి వేతనాలు వాటంతటవే పెరగడం అనేది ఎక్కడా జరగదు.

> మనది చాలా వేగంగా వృద్ధి చెందుతున్న దేశం అని అధికారులు చాలా గొప్పలు చెప్పుకుంటున్నారు. కాని ఇక్కడ ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ చర్యలు చాలా హీన స్థాయిలోనే కొనసాగుతున్నాయి. నిజానికి మన దేశానికి సంబంధించి పన్ను-జిడిపి నిష్పత్తి కేవలం 18.08 మాత్రమే. అంటే సంక్షేమం అమలు చేసే దేశాలలో చాలా దిగువన మనం ఉన్నాం.

పన్ను-జిడిపి నిష్పత్తి బాగా తక్కువగా ఉన్నప్పటికీ, ఆ దేశంలో జిడిపి వృద్ధి రేటు గనుక బాగా ఎక్కువగా ఉంటే అప్పుడు ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయ వనరులు అందుబాటులోకి వస్తాయని, వాటితో సంక్షేమ చర్యలు చేపట్టవచ్చునని కొందరు నమ్ముతారు. ఇది పూర్తిగా పొరపాటు. ఒక దేశం సంక్షేమ రాజ్యంగా మారడం అనేది గుట్టుచప్పుడు కాకుండా జరిగేదీ కాదు, ఎవరో కొందరి దయాగుణాల ప్రదర్శన ఫలితమూ కాదు. అది ఒక విధాన మార్పు ఫలితంగా మాత్రమే సాధ్యం. సంక్షేమానికి అవసరమైన మేరకు పన్నులను పెంచే వైఖరి అందులో ఒక భాగమే.

ఇక రెండవ సంగతి: జిడిపి వృద్ధి దానంతట అదే సంక్షేమ చర్యల వైపు దారి తీయదు సరికదా, జిడిపి వృద్ధి రేటు పట్ల ఆరాధనా భావం కలిగివుండడం వలన అది సంక్షేమ రాజ్యంగా మారడానికి ఆటంకంగా ఉంటుంది. పెట్టుబడిదారులకు ఆర్థిక వనరులను ఎక్కువగా అందిస్తే వాళ్ళు భారీగా పెట్టుబడులు పెడతారని, అప్పుడు ఆర్థికవృద్ధి మరింత ఎక్కువగా జరుగుతుందని ఈ ఆరాధకులు ప్రచారం చేస్తారు. పెట్టుబడిదారులకు ఇచ్చేబదులు సంక్షేమ చర్యలకు ఖర్చు చేయడం వలన ఆర్థికవృద్ధి కుంటుబడుతుందని వారు అంటారు. కేవలం ప్రచారం కోసం పాటుపడేవారు సంక్షేమ చర్యలకు పూనుకుంటారని, "ఉచితాలు" ప్రజలకు పంచి పెడతారని, ఆ విధంగా చేయడం ఆర్థిక వనరులను వృథా చేయడమే ఔతుందని, కొందరి తాత్కాలిక ప్రయోజనాల కోసం ఆర్థిక వృద్ధిని బలి చేయడమేనని వారు విమర్శిస్తుంటారు. జిడిపి వృద్ధి పట్ల ఈ విధంగా ఆరాధనాభావం ప్రదర్శించేవారు పన్ను-జిడిపి నిష్పత్తిని బాగా తక్కువగా ఉంచాలని, అలా గనుక చేయలేకపోతే, అది పెట్టుబడిదారుల "చొరవ"ను దెబ్బ తీస్తుందని, అప్పుడు వారు పెట్టుబడులు పెట్టడానికి వెనుకాడతారని, దాని ఫలితంగా జిడిపి వృద్ధి దెబ్బ తింటుందని వారు వాదిస్తారు.

ఈ తరహా వాదన పూర్తిగా తప్పు. తమ వద్ద ఎక్కువగా ఆర్థిక వనరులు ఉన్నంతమాత్రాన పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టడానికి సిద్ధం కారు. మార్కెట్ ఏ మేరకు పెరిగే అవకాశాలు ఉన్నాయన్న అంచనాపై ఆధారపడి వారు పెట్టుబడులు పెట్టడానికి పూనుకుంటారు. కాని మన గుడ్డి "ఆరాధకులు" దీనిని వేరేగా ప్రచారం చేస్తారు.

"ఉచితాల"కు ఎక్కువగా ఖర్చు చేస్తే దాని వలన పెట్టుబడిదారులు అక్కడి నుండి తరలిపోతారని వారు వాదిస్తారు. కాని ప్రపంచవ్యాప్తంగా సంక్షేమ విధానాలను అమలు చేసే దేశాల అనుభవాలను పరిశీలిస్తే పన్ను-జిడిపి నిష్పత్తిని గణనీయంగా పెంచి పెట్టుబడిదారుల నుండి అదనంగా పన్నులను వసూలు చేసినప్పుడే సంక్షేమం సాధ్యపడింది. అందుచేత సంక్షేమ విధానాలను అమలు చేయడాన్ని సమర్ధించేవారు పెట్టుబడిదారుల మీద అధికంగా పన్నులు విధించి వసూలు చేయాలన్న విధానాన్ని కూడా సమర్ధించాల్సిందే.

ఇక మూడవ అంశం: నయా ఉదారవాదం అంటేనే ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుగుణంగా, వారి కొల్లగొట్టే విధానాలకు అనుగుణంగా వ్యవహరించడం. కాని ఆ విధానాలను "వృద్ధి" అనే నాటకం ద్వారా అమలు చేస్తారు. అందుకే ప్రభుత్వ బడ్జెట్ నుండి నేరుగా పెట్టుబడిదారులకు వనరులను బదలాయిస్తారు. "ఆర్థిక వృద్ధి ని ప్రేరేపించడం" అనే పేరుతో అటువంటి బదిలీలను సమర్ధించుకుంటారు.

> ప్రపంచవ్యాప్తంగా సంక్షేమ విధానాలను అమలు చేసే దేశాల అనుభవాలను పరిశీలిస్తే పన్ను-జిడిపి నిష్పత్తిని గణనీయంగా పెంచి పెట్టుబడిదారుల నుండి అదనంగా పన్నులను వసూలు చేసినప్పుడే సంక్షేమం సాధ్యపడింది.

ఆర్థిక మాంద్యం నెలకొని పరిశ్రమలు మూతపడడం పెరుగుతున్నకొద్దీ ఈ విధంగా ఆర్థిక వనరులను పెట్టుబడిదారులకు బదలాయించడం ఇంకా పెరుగుతూ వుంటుంది. అందువలన సంక్షేమ చర్యలను అమలు చేయడానికి అవసరమైన వనరులు రాను రాను తగ్గిపోతూవుంటాయి. అందువల్లనే విద్య, వైద్యం తదితర ముఖ్యమైన సేవలన్నీ ప్రైవేటీకరించడం జరుగుతుంది. దాని ఫలితంగా శ్రామిక ప్రజలకు ఆ సేవలు మరింతగా అందుబాటులోకి రాకుండా పోతాయి. మాంద్యం నెలకొని వున్నందున పెట్టుబడిదారులకు బదలాయించిన సొమ్ము వారివద్దే ఉండిపోతుంది తప్ప మార్కెట్ లోకి పెట్టుబడి రూపంలో తిరిగి రాదు. ఇటు సంక్షేమం కోసం చేసే ఖర్చు తగ్గిపోయింది గనుక ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. అంటే స్థూల డిమాండ్ తగ్గిపోతుంది. దాని ఫలితంగా జిడిపి వృద్ధి రేటు మరింత తగ్గిపోతుంది. ఆర్థిక వృద్ధిని ప్రేరేపించడం కోసమే పెట్టుబడిదారులకు సంపద అదనంగా అప్పగించామని చెప్పినా, చివరికి జరిగింది మాత్రం దానికి పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది. ఐతే, తగ్గిపోయిన వృద్ధిరేటును సాకుగా చూపించి పాలకులు మరింతగా పెట్టుబడిదారులకు ఆర్థిక వనరులను మళ్ళీ బదలాయించడానికి పూనుకుంటారు. ఆ విధంగా మనం అంతకంతకూ సంక్షేమ విధానాలకు మరింత దూరంగా జరుగుతూ పోతాం.

ప్రస్తుతం భారతదేశంలో పాలకులు అనుసరిస్తున్న తర్కం ఇదే. ఈ విధానం వలన ప్రభుత్వం వద్ద ఉండే ఆర్థిక వనరులు ఎంత తగ్గిపోతున్నాయంటే చివరికి గ్రామీణ పేదలకు జీవనాధారంగా ఉపయోగపడుతున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకాన్ని సైతం నిలిపివేయాలనే యోచన చేస్తున్నది ప్రభుత్వం.

జిడిపి వృద్ధి రేటు పట్ల అమిత వ్యామోహంతో పన్ను-జిడిపి నిష్పత్తిని తక్కువ మోతాదులో కొనసాగిస్తే చివరికి ఆర్థిక వృద్ధీ సాధ్యం కాదు, ప్రజల సంక్షేమమూ దెబ్బ తింటుంది. సంక్షేమ విధానాలు అమలు జరగాలంటే పెట్టుబడిదారుల నుండి అధిక పన్నులు వసూలు చేయాల్సిందే. ప్రపంచవ్యాప్త అనుభవం ఇదే.

(స్వేచ్ఛానువాదం)

గురువులూ...మన్నించండి...

సమస్య

ఎ. అజ శర్మ

మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ అనే గొప్ప దేశం మనది. ఎక్కడ ఉపాధ్యాయులు గౌరవించబడతారో, ఆ సమాజంలో ప్రజలలో సభ్యత, సంస్కారం అంతగా విరాజిల్లుతాయి. తల్లిదండ్రుల తరువాత గురువులను గౌరవించే సంస్కార సమాజం మనది. ఇప్పటికీ ఆ సంస్కృతి బలీయంగానే ఉంది. అనేక మంది సీనియర్ సిటిజన్లుగా ఉన్నవారు కూడా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలలో తమకు చిన్నతనంలో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించడం, తమ ఉన్నతికి వారు వేసిన పునాది గురించి నెమరు వేసుకోవడం చూస్తూనే ఉన్నాం. అయితే, విచిత్రంగా ఆ గురువులనే లక్ష్యంగా పెట్టుకుని, వారిపై తీవ్ర ఆంక్షలు విధించే స్థితి నేడు ఆంధ్ర రాష్ట్రంలో నెలకొంది.

పాఠశాలలు మూసివేయవద్దని, విలీనాల పేరున పాఠశాలలను విద్యార్థులకు దూరం చేయొద్దని, సంస్కరణల పేరున విద్యా వ్యవస్థను బలహీన పరచవద్దని అడిగిన నేరానికి ఉపాధ్యాయులపై జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం ఏ మాత్రం క్షంతవ్యం కాదు. గతంలో ప్రభుత్వాలకు, ఉపాధ్యాయ సంఘాలకు వివిధ సందర్భాలలో అభిప్రాయ భేదాలొచ్చినా, వాటిని చర్చల ద్వారా, సామరస్యంగా పరిష్కరించుకున్న ఉదాహరణలున్నాయి. కానీ, ఇలా ప్రభుత్వమే కర్కశంగా వ్యవహరించిన తీరు ఎన్నడూ చూడలేదు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సిపిఎస్ రద్దు వంటి, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమిస్తున్న ఉపాధ్యాయులను అక్రమ అరెస్టులు చేయించడం, గృహ నిర్బంధాలకు పాల్పడడం, బైండోవరు కేసులు పెట్టడం, పాఠశాలల వద్ద కూడా పోలీసు పహారా పెట్టడం వంటి ప్రభుత్వ విపరీత చర్యలు సభ్య సమాజం, సాధారణ పౌరులు ఈసడించుకునేవిగా ఉన్నాయి. వీరిపై ఇలా అనుచితంగా ప్రవర్తించడానికి ఉపాధ్యాయులేమైనా రౌడీ షీటర్లనుకుందా ప్రభుత్వం? విద్యార్థులపై ఈ చర్యల ప్రభావం ఏ రకంగా పడుతుంది, ఎలా ఉంటుందనే కనీసమైన ఆలోచన కూడా లేదా ప్రభుత్వానికి?

దేశ భవిష్యత్తు పాఠశాలల నాలుగు గోడల మధ్యే నిర్మితమవుతుందని 1966లో విద్యా రంగంపై కొఠారి కమిషన్

తన నివేదిక మొదటి వాక్యంలో పేర్కొంది. ఇక్కడ నాలుగు గోడలంటే నాడు-నేడు పేరున రంగులు, బొమ్మలు వేసిన బయటి హంగులు కాదు. ఆ గోడల లోపల ఉపాధ్యాయులు నేర్పే విద్య ద్వారానే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరతారు. నేటి బాలలే రేపటి పౌరులంటారు. అటువంటి బాలలు పాఠశాలల్లో ఎంత బాగా తీర్చిదిద్దబడితే, సమాజం అంత ఉన్నతంగా రూపుదిద్దుకుంటుంది. అక్షరాస్యతలో అగ్ర భాగాన ఉన్న నార్వే, స్వీడన్, ఫిన్‌లాండ్, డెన్మార్క్ వంటి దేశాలే ఆర్థిక, సామాజిక, పౌరుల ఉన్నత ప్రమాణాల వంటి అన్ని రంగాలలోనూ కూడా అగ్ర భాగాన ఉన్నాయి. సమాజంలో విద్యకున్న ప్రాధాన్యత అటువంటిది. కానీ, ప్రపంచ దేశాలతో పోలిస్తే నేడు మన దేశం 73 శాతం అక్షరాస్యతతో 191 దేశాలకు గాను 145వ స్థానంలో ఉంది. అందులో కూడా ఆంధ్ర రాష్ట్రం 67 శాతం అక్షరాస్యతతో దేశంలోని 36 ప్రాంతాలకు గాను 31వ స్థానంలో అధమాన ఉండడం సిగ్గుపడవలసిన విషయం. దాన్ని ఎలా మెరుగు పరచాలా అని ఆలోచన చేయవలసిన ప్రభుత్వం, విచిత్రంగా దాన్ని ఇంకా అగమ్యగోచర పరిస్థితులలోకి నెట్టివేసే విధానాలను అవలంభించడం సమాజ భవిష్యత్తుకు, పురోభివృద్ధికి తీవ్ర ఆటంకంగా నిలుస్తుంది.

ప్రభుత్వాలు కొన్ని సందర్భాలలో పొరపాట్లు చేయడం అసహజమేమీ కాదు. కానీ ఆ పొరపాట్లను వేలెత్తి చూపడమే నేరంగా చూడడం అసలైన నేరం. అటువంటి నేరానికి రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతోంది. తప్పులు సరిచేసుకోండి మహాప్రభో అని చెప్పిన ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ శాసన మండలి సభ్యుల పట్ల కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించడం, అరెస్టులు చేయడాన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలి?

ఈ ప్రభుత్వం నేడు ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పడం కంటే బోధనేతర పనులు ఎక్కువగా చేయిస్తోంది. బాత్ రూమ్‌ల తనిఖీ, మధ్యాహ్న భోజనం, హాజరు వంటి వివిధ యాప్‌ల పేరున పని భారం పెంచుతోంది. దీనివల్ల సహజంగానే పాఠాలు చెప్పడానికి వెచ్చించే సమయం తగ్గుతోంది. మమ్మల్ని ఈ బోధనేతర పనుల నుండి తప్పించి, పాఠాల మీద సమయాన్ని వెచ్చించే అవకాశం కల్పించండి అని ప్రభుత్వానికి వీరు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం కలగలేదు. సరికదా, ప్రభుత్వం ఆ పనులన్నింటినీ అలాగే ఉంచింది. అయితే తాజాగా బోధనేతర పనులని చెప్పి ఎప్పుడో ఐదేళ్ళకోసారి వచ్చే ఎన్నికల విధుల నుండి వీరిని తప్పిస్తూ ఆగమేఘాల మీద నిర్ణయించింది. దీని వెనుక మర్మమేమిటో కొద్దిగా ఆలోచించేవారెవరికైనా ఇట్టే అర్థమవుతుంది.

ఇక్కడ తప్పక గమనించవలసిన అంశం ఒకటుంది. అదేమిటంటే ఇప్పుడు ప్రభుత్వం ఏం చేయాలి? ఉపాధ్యాయులేం చేయాలనే దాని కంటే పౌర సమాజం ఏం చేయాలనేదే. ఇదేదో మనకు సంబంధించిన సమస్య కాదు అనుకుంటే అది పొరపాటే. సమాజం పురోగమించాలంటే అంతిమంగా ప్రజలే సూత్రధారులు, పాత్రధారులు. ఎవరైనా ఆ పురోగమనానికి అడ్డంకిగా ఉంటే ప్రమాదమే. అందులోనూ ప్రజలతో ఎన్నుకోబడిన ప్రభుత్వం అడ్డంకిగా ఉంటే ఇంకా ప్రమాదం. ప్రజల ప్రతినిధిగా ఉండే ప్రభుత్వం చేసిన పొరపాట్లను కూడా అంతిమంగా ప్రజలే సరిచేయాలి. నేడు ఉపాధ్యాయులపై జరుగుతున్న నిర్బంధాన్ని కూడా అదే కోణం నుంచి పరిశీలించాలి. భావిభారత సమాజ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించే గురువులకు అవమానం జరగడమంటే, అది మొత్తం సమాజానికి జరిగినట్లే. అందుకే, గురువులూ... మన్నించండి...మీ పట్ల ప్రభుత్వానికి గౌరవం లేదోమో కానీ, మాకు మాత్రం అపార గౌరవం ఉంది...అని భరోసాగా పౌర సమాజం నిలబడాలి. సమాజంలో ఉపాధ్యాయులకు ఉన్నత స్థానం వుందన్న వాస్తవాన్ని గుర్తించి ప్రభుత్వం ఇప్పటికైనా కనీస సంస్కారాన్ని ప్రదర్శించడం వివేకం అనిపించుకుంటుంది.

/వ్యాసకర్త : ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి /

మత విశ్వాసం-స్వేచ్ఛ



కత్తిరింపులు

విశ్వాసం, పెళ్లి వంటి వాటికి రాజ్యం దూరంగా వుంటేనే మత స్వేచ్ఛ రక్షించబడుతుంది. బలవంతపు మత మార్పిడులను ఎదుర్కొనడం అనే పేరుతో నడుస్తున్న సుదీర్ఘమైన వ్యాజ్యాలు న్యాయస్థానాల విలువైన సమయాన్ని హరించి వేస్తున్నాయి. దేశంలో మోసపూరితంగా జరుగుతున్న మత మార్పిడిని అణచివేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిల్)పై సుప్రీం కోర్టు విచారిస్తోంది. ఈ విషయంలో వెనుకబడకూడదనుకుంటున్న గుజరాత్ ప్రభుత్వం కూడా తాము తీసుకువచ్చిన మత మార్పిడి నిరోధక చట్టంలోని నిబంధనపై స్టే ఎత్తివేయాలని కోరుతోంది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఏ మత మార్పిడైనా జరగడానికి ముందుగా జిల్లా మేజిస్ట్రేట్ నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆ నిబంధన కోరుతోంది. గుజరాత్ మత స్వేచ్ఛా చట్టం-2003 (వివాహం ద్వారా మత మార్పిడిని పొందుపరిచేందుకు 2021లో సవరించారు) లోని సెక్షన్ 5పై గుజరాత్ హైకోర్టు సరిగానే స్టే విధించింది. మతాంతర వివాహాలను చట్టవిరుద్ధమైన మత మార్పిడులకు ఉదాహరణలుగా పేర్కొంటూ వాటిని కవర్ చేయాలని కోరుతున్న ఇతర నిబంధనల అమలుపై కూడా స్టే విధించింది. ముందస్తు అనుమతి తప్పనిసరనే ఈ నిబంధన వల్ల ఎవరైనా తమ మతాన్ని లేదా విశ్వాసాన్ని మార్చుకోవాలనుకుంటే దాన్ని ముందుగానే వెల్లడించాల్సి రావడం వారిపై ఒత్తిడిని పెంచుతుందని హైకోర్టు పేర్కొంది. వివాహం, నమ్మకం అనేవి ఒక వ్యక్తి స్వంత ఎంపికగా వుండాలని పేర్కొంటున్న సుప్రీం కోర్టు గత రూలింగ్‌లకు ఈ నిబంధన విరుద్ధంగా వుందని పేర్కొంది. సెక్షన్ 5పై విధించిన స్టే ఎలాంటి మోసం లేదా బలవంతం లేని వాస్తవమైన మతాంతర వివాహాలను కూడా దెబ్బ తీస్తోందంటూ గుజరాత్ వాదించడం ఇక్కడ ఆశ్చర్యకరం. మతాంతర వివాహం పర్యవసానాలు ఏమైనా వున్నట్లైతే ఈ ముందస్తు అనుమతి తప్పనిసరి నిబంధన వల్ల మత మార్పిడి నిజమైన స్వభావాన్ని ప్రశ్నించాల్సిన అవసరం రాదు.

స్వచ్ఛంద మత మార్పిడికి ఈ నిబంధన వెసులుబాటు కల్పిస్తోందని ఏ ఒక్కరూ పేర్కొనడం లేదు. కేవలం మతాంతర వివాహం జరిగిందనే వాస్తవం ఆధారంగా ఎలాంటి ప్రశ్నలు తలెత్తనప్పుడు లేదా ఎలాంటి అనుమానాలకు తావివ్వనప్పుడు మాత్రమే మత స్వేచ్ఛకు రక్షణ కల్పించబడుతుంది. తన విశ్వాసాన్ని మార్చుకోవాలనే ఉద్దేశ్యాన్ని వెల్లడించాలని ఒకరిపై ఒత్తిడి చేయడమంటేనే అది వారి మనస్సాక్షికి సంబంధించిన స్వేచ్ఛను, గోప్యతా హక్కును ఉల్లంఘిస్తుందనేది ఇంగిత జ్ఞానానికి సంబంధించిన అంశం. అలాగే, ఈ నిబంధనలపై స్టే విధిస్తూ హైకోర్టు జారీ చేసిన తాత్కాలిక ఉత్తర్వులకు వ్యతిరేకంగా ప్రత్యేకంగా చేసిన అప్పీల్ సుప్రీం కోర్టులో పెండింగ్‌లో వుండగా...మత మార్పిడులకు వ్యతిరేకంగా దాఖలైన పిల్‌పై ప్రస్తుతం జరుగుతున్న విచారణలో భాగంగా ముందస్తు అనుమతి తప్పనిసరనే నిబంధనను పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్ అవసరం లేదు. ఇక విస్తృతాంశానికి సంబంధించి చూసినట్లైతే, ప్రలోభాల ద్వారా లేదా దాతృత్వ కార్యక్రమాల ద్వారా మత మార్పిడి అనేది చాలా తీవ్రమైన సమస్య అంటూ జస్టిస్ ఎం.ఆర్.షా నేతృత్వంలోని సుప్రీం కోర్టు బెంచ్ చేసిన వ్యాఖ్యలు...జాతీయ స్థాయిలో మత మార్పిడి నిరోధక చర్యలు తీసుకురావడానికి ప్రభుత్వాన్ని ప్రేరేపించడానికి ఆసక్తిని సూచిస్తున్నాయి. దేశవ్యాప్తంగా విశృంఖలంగా, మోసపూరితంగా మత మార్పిడులు జరుగుతున్నాయంటూ వస్తున్న అతిశయోక్తితో కూడిన ఆరోపణలపై న్యాయస్థానాలు విచారించాలా అనేది ఇక్కడ ప్రశ్నార్థకమే. దానికి బదులుగా, సమస్య ఏదైనా వుంటే దాని తీవ్రత ఎంత వుందో గుర్తించేందుకు వాటిని రాష్ట్రాలకు వదిలిపెట్టి, మత స్వేచ్ఛ, మత సామరస్యతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సి వుంది.

/'హిందూ' సంపాదకీయం/

విదేశీయుడికి నాలుగేళ్ల కస్టడీయా?

- క్రిస్టియన్ మిచెల్ జేమ్స్‌పై సిబిఐ, ఇడికి సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ : అగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టర్ల కుంభకోణం కేసులో నిందితుడు క్రిస్టియన్ మిచెల్ జేమ్స్‌ను నాలుగేళ్లపాటు కస్టడీలో ఉంచడంపై సిబిఐ, ఇడిలను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. వాస్తవం ఏదైనా ఒక విదేశీయుడిని అప్పగింత చట్టం ద్వారా భారత్‌కు తీసుకొచ్చి ఇన్నేళ్లపాటు కస్టడీలో ఉంచడం అతని స్వేచ్ఛను హరించడమేనని వ్యాఖ్యానించింది. క్రిస్టియన్ మిచెల్ జేమ్స్ భారత దేశస్తుడయివుంటే బెయిల్ మంజూరు చేసేందుకు కోర్టు మొగ్గు చూపేదని ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను విచారించడానికి సిబిఐ ఇప్పటి వరకూ ఒక్క అనుమతి కూడా పొందలేకపోయిందని విమర్శించింది. బెయిల్ కోసం జేమ్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణను జనవరి రెండో వారానికి వాయిదా వేసింది.

మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌ఛార్జిలు

న్యూఢిల్లీ : రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హర్యానా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఇన్‌చార్జిలను ఆ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే మంగళవారం నియమించారు. ప్రస్తుతం రాజస్థాన్‌కు ఇన్‌చార్జిగా ఉన్న అజయ్ మేకన్‌ను ఆ స్థానం నుంచి తొలగించి సుఖీజిందర్ సింగ్ రాంధవాను కొత్త ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఛత్తీస్‌గఢ్‌లో పిఎల్ పునియాను తొలగించి కొత్త ఇన్‌చార్జ్‌గా కుమారి సెల్జాను నియమించారు. ఢిల్లీ ఇన్‌చార్జ్‌గా ఉన్న రాజ్యసభ సభ్యులు శక్తిసిన్హా గోహిల్‌కు హర్యానా ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఇడి విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయగలరా : భూపేష్ బఘేల్

రాయ్‌పూర్ : మోడీ ప్రభుత్వానికి చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ సవాలు విసిరారు. మంగళవారం రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌లోని ఇడి కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ప్రభుత్వం ఆందోళన నిర్వహించింది. ఈ నిరసనలో రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ మోహన్ మార్కం, పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపేష్ బఘేల్ మాట్లాడుతూ... ప్రతిపక్షాలను ఇరుకున పెట్టేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఇడి, సిబిఐలను మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని అన్నారు. ధైర్యముంటే.. మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీని ఇడి విచారిస్తున్న సమయంలో కెమెరాలు అమర్చి ప్రత్యక్ష ప్రసారం చేయాలని అన్నారు. సోనియాగాంధీని ప్రశ్నిస్తున్న సమయంలో మీడియాను అనుమతించాలని అన్నారు. ఆరోగ్యం సరిగాలేని 75 ఏళ్ల మహిళను ఇడి సమన్ల ద్వారా మోడీ ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని విమర్శించారు. సోనియాగాంధీ నుంచి లిఖితపూర్వక స్టేట్‌మెంట్‌ను తీసుకోకూడదా అని ప్రశ్నించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్‌ను ఇడి అధికారులు ఎందుకు విచారించలేదని కేంద్రాన్ని నిలదీశారు.

మోర్బీ ఘటనపై ట్వీట్.. టిఎంసి ప్రతినిధి అరెస్ట్

న్యూఢిల్లీ : మోర్బీ బ్రిడ్జి ఘటనపై ట్వీట్ చేసిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సాకేత్ గోఖలేను గుజరాత్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాకేత్ సోమవారం రాత్రి ఢిల్లీ నుండి రాజస్థాన్‌లోని జైపూర్‌కు వెళ్లగా.. అక్కడి నుండి గుజరాత్ పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారని టిఎంసి సీనియర్ నేత డెరెక్ ఒబ్రెయిన్ ట్వీట్ చేశారు. గుజరాత్‌లో మోర్బీలోని బ్రిడ్జి కూలిన ఘటనలో 130 మందికి పైగా మరణించిన సంగతి తెలిసిందే. మోర్బీ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4లక్షల నష్టపరిహారం మొత్తం రూ. 5 కోట్లు కాగా, మోడీ సందర్శించినందుకు అయిన ఖర్చు రూ.30 కోట్లు అని, ఫోటోషూట్‌ల కోసం రూ. 5.5కోట్లు ఖర్చు పెట్టినట్లు ఆర్‌టిఐ ద్వారా వచ్చిన సమాచారాన్ని సాకేత్ ట్వీట్ చేశారు.

ఉగ్రవాదానికి నిధులను అడ్డుకోవడం అత్యవసరం: దోవల్

న్యూఢిల్లీ : ఉగ్రవాదానికి నిధుల ప్రవాహాన్ని అడ్డుకోవడం అత్యవసరమని కేంద్రం పేర్కొంది. ఆఫ్ఘనిస్థాన్‌తో పాటు మధ్య ఆసియాలో పెరుగుతున్న ఉగ్రవాద సంస్థలకు నిధుల ప్రవాహాన్ని అడ్డుకోవడం భారత్‌తో పాటు ఇతర దేశాలకు అత్యవసరమని సూచించింది. మంగళవారం నిర్వహించిన "జాతీయ భద్రతా సలహాదారులు/ భద్రతా మండలి కార్యదర్శులు" ప్రారంభ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఎ) అజిత్ దోవల్ ప్రసంగిస్తూ.. ఈ ప్రాంతంలోని దేశాలన్నింటికీ ఆఫ్ఘనిస్థాన్ ముఖ్యమైన సమస్య అని అన్నారు. కజికిస్థాన్, కిర్గిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్ దేశాల నుద్దేశించి మాట్లాడారు.

భారత వృద్ధి 6.9 శాతం : ప్రపంచ బ్యాంక్ అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6.9 శాతంగా ఉండొచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ఇంతక్రితం వేసిన అంచనా 6.5 శాతంతో పోల్చితే ఇది కొంత మెరుగు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రతికూల పరిణామాలు ఎదురవుతున్నప్పటికీ.. భారత ఆర్థిక వ్యవస్థ రాణిస్తుందని పేర్కొంది. భారత వృద్ధి రేటు అంచనాలను 7.5 శాతం నుంచి 6.5 శాతానికి తగ్గిస్తూ.. ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది.

పని ప్రదేశాల్లో పెరిగిన మానసిక హింస, వేధింపులు

- గ్లోబల్ సర్వే నివేదిక

న్యూయార్క్ : ఇప్పటివరకూ పనిచేసే చోట శారీరక, లైంగిక వేధింపులు ఎదుర్కొన్నవాళ్ల గురించి చదివాం. 'పనిప్రదేశాల్లో మానసిక హింస అనేది ఈ మధ్య ఎక్కువైంది. ఇది చాలా ప్రమాదకరం. దీనివల్ల చాలా దుష్పరిణామాలున్నాయి. చాలామంది ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింటుంది. వాళ్ల కెరీర్ నాశనమవుతుంది. ఫలితంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారు' అని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ కార్మిక సంస్థ తెలిపింది. ఈ సర్వే వివరాలను ఐరాస అంతర్జాతీయ కార్మిక సంస్థ, లల్లాయిడ్ రైట్స్ ఫౌండేషన్, గాల్లప్ సంస్థ సోమవారం విడుదల చేశాయి. ఆఫీస్, పనిచేసే చోట ఎదురయ్యే వేధింపులలో మానసిక హింస శాతం ఎక్కువని ఈ సర్వేలో చాలామంది ఉద్యోగులు చెప్పారు. మహిళా ఉద్యోగులు మాత్రమే కాదు మగవాళ్లు కూడా ఈ సమస్య ఎదుర్కొన్నట్టు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 17.9 శాతం మంది ఉద్యోగులు మానసిక హింసకు గురయ్యామని వెల్లడించారు. 8.5శాతం మంది తాము పని ప్రదేశంలో శారీరక హింసను అనుభవించామని, 6.3 శాతం మంది లైంగిక వేధింపుల బారిన పడ్డట్టు చెప్పుకొచ్చారు.

గతేడాది ఏడాది 121 దేశాల్లో సైకలాజికల్ వయొలెన్స్ గురించి 75,000 మందిపై సర్వే చేశారు. దాదాపు 22 శాతం మంది ఏదో ఒక రూపంలో హింసకు గురైనట్టు తెలిపారు. ఆఫీసులో, కంపెనీలో చాలాసార్లు మానసిక వేధింపులు ఎదుర్కొన్నామని, మానసిక హింసకు గురై దాదాపు ఐదేళ్లు కావొస్తుంది అని మానసిక వేధింపుకుల గురైన వాళ్లలో దాదాపు 60 శాతం మంది చెప్పారు.పని ప్రదేశాల్లో సైకలాజికల్ వయొలెన్స్, హరాస్‌మెంట్ మీద ప్రపంచవ్యాప్తంగా స్టడీ చేయడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

ఉద్యోగాల అవుట్ సోర్సింగ్‌పై

తమిళనాడులో నిరసనలు

చెన్నై : తమిళనాడులో సాధారణ, మున్సిపల్ పరిపాలన విభాగాల్లో ఉద్యోగాలను అవుట్ సోర్సింగ్స్ చేయాలనే డిఎంకె ప్రభుత్వ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెలువెత్తుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 20 మున్సిపల్ కార్పొరేషన్‌ల్లోనూ, వివిధ ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్-డి ఉద్యోగాలను అవుట్ సోర్సింగ్స్ చేయడానికి ప్రభుత్వం జిఓ విడుదల చేసింది. పట్టణ పంచాయతీల్లో వీధిదీపాలు, మంచినీటి సరఫరా, భూగర్భ మురుగునీటి పారుదల, ఘన వ్యర్థాల నిర్వహణ కూడా అవుట్ సోర్సింగ్స్ చేయడానికి అనుమతిస్తూ ప్రభుత్వం మరొక జిఓ విడుదల చేసింది. ఇలాంటి నిర్ణయాలతో కార్మికులు దోపిడికి గురవుతారని, నియామకాల్లో రిజర్వేషన్లు పాటించరని, ప్రజలకు సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతాయని ఉద్యోగ, యువజన సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయం ఫలితంగా మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఉద్యోగుల సంఖ్య 35 వేల నుంచి 3,500కు పడిపోతుందని తెలిపాయి. పదేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు, దినసరి వేతన కార్మికులను క్రమబద్ధీకరిస్తామన్న ఎన్నికల హామీకి వ్యతిరేకంగా డిఎంకె ప్రభుత్వం జిఓ విడుదల చేయడాన్ని విమర్శిస్తున్నాయి. ఉద్యోగాల సంఖ్యను తగ్గించడంతో ప్రస్తుతం ఉన్న ఉద్యోగులపై అధికపనిభారం పడుతుందని తెలిపాయి. ప్రభుత్వ జిఓలకు వ్యతిరేకంగా పారిశుధ్య కార్మికుల, పంప్ ఆపరేటర్ల, ఓవర్‌హెడ్ ట్యాంక్ ఆపరేటర్ల ఉద్యోగుల సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశాయి.

ఉద్యోగులకు పరిహారం చెల్లించని మెటా!

న్యూయార్క్ : ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా ఇటీవల తొలగించిన తమ 11వేల మంది ఉద్యోగులను దారుణంగా మోసం చేస్తోంది. ఉద్వాసన సమయంలో వారందరికీ పలు నగదు ప్రయోజనాలతో కూడిన పరిహార ప్యాకేజీని ఇస్తామన్న హామీని తుంగలో తొక్కిందని రిపోర్టులు వస్తున్నాయి. ప్రతి ఒక్కరికి హామీ ఇచ్చిన పరిహారాన్ని అందించడం లేదని, తొలుత కొందరు ఉద్యోగులను తొలగించిన అనంతరం వారికి ఇచ్చిన పరిహార ప్యాకేజ్ కంటే తమకు తక్కువ ప్రయోజనాలు వర్తింపచేశారని పలువురు ఉద్యోగులు ఫిర్యాదు చేస్తున్నారు. ఉద్యోగాలు కోల్పోయిన వారందరికీ 16 వారాల బేస్ సెవరెన్స్ పేమెంట్‌తో పాటు ప్రతి ఏడాది సర్వీస్‌కు రెండు వారాల అదనపు చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చింది. వైద్య బీమా మద్దతును ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఆరు నెలల పాటు కల్పించనున్నట్లు మెటా తెలిపింది.

హైకోర్టు జోక్యంతో దిగొచ్చిన యుపి సర్కారు

- రాతపూర్వక హామీతో విద్యుత్ ఉద్యోగుల దీక్ష విరమణ

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో జీతభత్యాలు, పవర్ కార్పొరేషన్ నియంతృత్వ వైఖరిపై రెండు వారాలుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు తమ దీక్షను విరమించారు. విద్యుత్ ఉద్యోగుల సమ్మెపై అలహాబాద్ హైకోర్టు జోక్యం చేసుకోవడంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దిగరాక తప్పలేదు. ఉద్యోగుల సమస్యలను ఎందుకు పరిష్కరించడంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి (విద్యుత్) మహేష్ గుప్తాకు హైకోర్టు సమన్లు జారీ చేసింది. హైకోర్టు సమన్ల తరువాత విద్యుత్ శాఖ మంత్రి అరవింద్ కుమార్ శర్మ, ముఖ్యమంత్రి సలహాదారులు అవనిష్ అవస్థి నుంచి రాతపూర్వక హామీ లభించడంతో ఉద్యోగులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒప్పంద పత్రాలపై ఉద్యోగ సంఘాల నేతలు సంతకం చేశారు. ఒప్పందం ప్రకారం ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వడానికి, ఆరోగ్య సేవలకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించింది. విద్యుత్ రంగ ఉద్యోగుల రక్షణ చట్టాన్ని వీలైనంత త్వరగా అమలు చేస్తామని కూడా ప్రభుత్వం తెలిపింది. 15 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఈ హామీలో ప్రభుత్వం విఫలమైతే నిరసన మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు.

ఐడిబిఐ బ్యాంక్ విదేశీపరం..!

న్యూఢిల్లీ : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి), ప్రభుత్వ భాగస్వామ్యంలోని ఐడిబిఐ బ్యాంక్‌ను విదేశీ శక్తుల పరం చేయడానికి మోడీ సర్కార్ ఆసక్తిగా ఉంది. ఈ బ్యాంక్‌ను అమ్మే ప్రక్రియను కేంద్రం వేగవంతం చేసింది. ఇందులోని 51 శాతం పైగా వాటాలను విదేశీ కన్సోరియం కొనుగోలు చేయడానికి వీలు కల్పించినట్లు ప్రభుత్వ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. దేశంలో నూతన ప్రయివేటు బ్యాంక్‌ల ఏర్పాటులో విదేశీ యాజమాన్యాన్ని పరిమితం చేస్తాయి. అయితే ఈ నిబంధనలు కొత్త ప్రయివేటు బ్యాంక్‌లకు మాత్రమే వర్తిస్తాయని.. ప్రస్తుతం ఐడిబిఐ బ్యాంక్ లాంటి వాటికి వర్తించవని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) పేర్కొంది. ఇదే విషయాన్ని బిడ్డర్ల అనుమానాలకు ఓ సమాధానంగా తెలిపింది. ఐడిబిఐ బ్యాంక్‌లో మెజారిటీ వాటాల స్వాధీనానికి వీలుగా డిసెంబర్ 16 వరకు బిడ్డింగ్‌లను అహ్వానిస్తున్నారు.

కేరళలో ఎస్ఎఫ్ఐ నేతపై దాడి

- ఐదుగురు అరెస్టు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అపర్ణా గౌరి

తిరువనంతపురం : కేరళలోని వాయనాడ్‌కి సమీపంలో మేప్పడిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో యూనియన్ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ)కి చెందిన పలువురు విద్యార్థులపై, పోలీసు అధికారిపై దాడి జరిగింది. తీవ్రంగా గాయపడిన వారిలో మహిళా నేత కూడా వున్నారు. శనివారం నాటి ఈ ఘటనలో ఐదుగురిని అరెస్టు చేశారు. వాయనాడ్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా సంయుక్త కార్యదర్శి అపర్ణా గౌరికి ఈ దాడిలో తీవ్రంగా గాయాలయ్యాయి. కొంతమంది పోలీసు అధికారులు కూడా గాయపడ్డారు. దాడికి పాల్పడిన వారిని ఇతర రాజకీయ పార్టీలకు చెందిన వారుగా అనుమానిస్తున్నారు. మేప్పడి పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ విబిన్‌ఎబిపై దాడికి సంబంధించి అలాన్ ఆంటోనీ అనే వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. గాయపడిన గౌరిని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చి చికిత్సనందించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి బాగుందని పోలీసులు తెలిపారు. కాలేజీకి సమీపంలో పనిచేస్తున్న డ్రగ్ మాఫియా పనే ఇదని వామపక్షాలు, ఎస్ఎఫ్ఐ విమర్శించాయి. విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక చైతన్యాన్ని పెంపొందిస్తామని, తద్వారా రాజకీయ పార్టీల ముసుగులో కాలేజీ కేంపస్‌ల్లో పనిచేసే డ్రగ్ మాఫియాను ఓడిస్తామని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు వి.పి.సాను ట్వీట్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా సిపిఎం ఒక ప్రకటనలో కోరింది. ఈ హింసాకాండకు సంబంధించి పోలీసులు పలు రకాల కేసులను నమోదు చేశారు.

మాజీ అధ్యక్షునికి నివాళులర్పించిన జిన్‌పింగ్

బీజింగ్ : ఇటీవల కన్నుమూసిన చైనా మాజీ అధ్యక్షుడు జియాంగ్ జెమిన్‌కు మంగళవారం నిర్వహించిన సంస్మరణ సభలో అధ్యక్షుడు జిన్‌పింగ్ నివాళులర్పించారు. చైనా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడంలో జియాంగ్ జెమిన్ పాత్రను ప్రశంసించారు. ఆయన కీర్తి, విజయం, ప్రజాదరణ ఎల్లప్పుడూ చరిత్రలో భాగంగా ఉంటాయని, తరతరాలుగా ప్రజల హృదయాలలో నిలిచి ఉంటుందని జిన్‌పింగ్ ప్రశంసించారు. బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో మంగళవారం జియాంగ్ స్మారక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిన్‌పింగ్ సహా సిపిసి మాజీ ప్రీమియర్ వెన్ జియాబావో, జియాంగ్ భార్య వాంగ్ యెపింగ్, ఉన్నత సైనికాధికారులు హాజరయ్యారు. గతనెల 30న షాంఘైలో లుకేమియా, ఇతర వ్యాధులతో జియాంగ్ మరణించిన సంగతి తెలిసిందే. జియాంగ్ 1989 నుండి 2002 వరకు అధ్యక్షునిగా, చైనా కమ్యూనిస్ట్ పార్టీ (సిసిపి) ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రధాన ఆర్థిక శక్తిగా చైనా ఎదుగుదలను పర్యవేక్షించడం, క్లిష్ట సమయాల్లో కఠిన నిర్ణయాల ద్వారా పాలక కమ్యూనిస్ట్ పార్టీకి మార్గనిర్దేశం చేశారు.

ఆశిష్ మిశ్రా, మరో 13మందిపై అభియోగాల నమోదు

లఖింపూర్ ఖెరి : గతేడాది అక్టోబరులో లఖింపూర్ ఖెరిలో జరిగిన హింసాకాండకు సంబంధించిన కేసులో కేంద్ర మంత్రి కుమారుడు ఆశిష్ మిశ్రా, మరో 13మందిపై న్యాయస్థానం మంగళవారం అభియోగాలు నమోదు చేసింది. ఈ హింసాకాండలో నలుగురు రైతులు మరణించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా ఈ కేసులో ప్రధాన నిందితుడుగా వున్నాడు. దీనిపై తదుపరి విచారణ ఈ నెల 16న చేపట్టాలని అదనపు జిల్లా న్యాయమూర్తి సునీల్ కుమార్ వర్మ నిర్ణయించినట్లు జిల్లా ప్రభుత్వ న్యాయవాది (క్రిమినల్) అరవింద్ త్రిపాఠి తెలిపారు. మిశ్రాపై హత్య, హత్యా యత్నం, అల్లర్లు, ఆయుధాల చట్టం తదితర అభియోగాలను నమోదు చేశారు.

రైతు ఆత్మహత్యలేనా అద్భుత పాలన?

(మొదటి పేజీ తరువాయి)

ఘనంగా స్వాగతించారు. గుంటూరు జిల్లా నర్సరావుపేటలో మహిళలు డప్పుకొట్టి స్వాగతం పలికారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావు పేటలోని పల్నాడు బస్టాండ్ కూడలి, ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల, జిల్లా కేంద్రమైన కర్నూలు, నంద్యాల జిల్లా ఆత్మకూరుల్లో జరిగిన బహిరంగ సభల్లో ఎఐకెఎస్ కోశాధికారి కృష్ణప్రసాద్, ఎఐకెఎస్ అఖిల భారత నాయకులు ప్రకాశం మాస్టర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే తెచ్చిందని, రైతుల కోసం కాదని అన్నారు. మోడీ పాలనలో దేశంలో ఏటా 15 వేల నుంచి 20 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. రైతులు, వ్యవసాయ కూలీలతో వచ్చే ఏడాది ఐదున ఢిల్లీలో బహిరంగ సభ జరగనుందని, కేంద్రం గడగడలాడే దీన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని, రైతులను కాపాడు కోవడానికి రైతు సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయన్నారు. ప్రజలందరూ మద్దతుగా నిలవా లని కోరారు. వ్యవసాయ నల్ల చట్టాల రద్దు సందర్భంగా రైతులకు మోడీ ఇచ్చిన హామీ అమలు కావడం లేదని, పైగా విద్యుత్తు సవరణ బిల్లును కేబినెట్‌లో ఆమోదించి పార్లమెంటు కు పంపడం దుర్మార్గమని అన్నారు. ప్రజలందరి పైనా విద్యుత్తు భారాలు పడతాయని తెలిపారు. ఇప్పుడు రైతులు పొందుతున్న ఉచిత విద్యుత్తు 2000 సంవత్సం రలో చేసిన చారిత్రాత్మక విద్యుత్తు పోరాట ఫలితమేనని గుర్తు చేశారు. పాలకులు అన్ని విధాలుగా ప్రమాదకర విధానాలు అమలు చేస్తోన్న నేపథ్యంలో మరోసారి జాతీయ విముక్తి పోరా టానికి, రెండో స్వాతంత్ర్య పోరాటానికి ప్రజలు సన్నద్ధం కావాలని కోరారు. త్రిసూర్‌లో జరిగే మహాసభలో భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను చిన్నచూపు చూస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమది రైతు ప్రభుత్వమని చెప్తోన్నా, రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులపై చిత్తశుద్ధి ఉంటే పెండింగ్‌లోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలని, పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని బతికించి రైతుల ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ జాతా ఉద్దేశమన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, రైతు రుణాలు మాఫీ చేయాలని, కౌలు రైతులు, వ్యవ సాయ కూలీలకు నెలకు రూ.5 వేల పింఛను ఇవ్వాలని డిమా ండ్ చేశారు. డప్పు కళాకారుల ప్రదర్శనలు, ప్రజానాట్య మండలి కళా కారుల గేయాలతో అలరించారు.

ఐసిడిఎస్ బలోపేతానికి ఐక్య ఉద్యమాలు

(మొదటి పేజీ తరువాయి)

పాలించాయని, దీన్ని ఎదిరించి పెకిలించి వేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ రంగాన్నే కాకుండా, ఇతర సంక్షేమ పథకాలనూ లక్ష్యంగా చేసుకుందని, బడ్జెట్ కేటాయింపులను తగ్గించిందని విమర్శించారు. పరిపాలనలో కార్పొరేట్ సంస్థలు పాలుపంచుకుంటున్నాయని ఆరోపించారు. రైతులు, దినసరి కార్మికులు అంతా ఇబ్బందులు పడుతున్నారని, ఈ కేంద్ర ప్రభుత్వం అన్నింటినీ ప్రైవేటీకరించాలని చూస్తుందని చెప్పారు. రవాణా, విద్యుత్ రంగాలను కూడా ప్రైవేటీకరించారని చెప్పారు. రైతు ఉద్యమం, ఇరాన్‌లో మహిళా ఉద్యమాలను ప్రస్తావిస్తూ.. కార్మికులు తమ శత్రువులను గుర్తించాలని, ప్రభుత్వాల్లో ఉన్న కార్పొరేట్, మతతత్వ శక్తుల బంధాన్ని బహిర్గతం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ రంగాన్ని రక్షించడానికి చర్యలు తీసుకోవాలని, ప్రజల్ని, దేశాన్ని రక్షించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్ఎడబ్ల్యూహెచ్ ప్రధాన కార్యదర్శి ఎఆర్ సింధు, అధ్యక్షులు యు శరణి, కార్యదర్శి వీణా గుప్తా, కోశాధికారి అంజు మైని ప్రసంగించారు. దేశం నలుమూలల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

144వ సెక్షన్ ఉల్లంఘిస్తే ఇక నేరుగా కేసులే!

- పోలీసులకు అధికారాలు కల్పిస్తున్న గుజరాత్ బిల్లుకు కేంద్రం ఆమోద ముద్ర

న్యూఢిల్లీ : క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి)లోని 144వ సెక్షన్‌ను ఉల్లంఘించి, ఆందోళనలు, నిరసనలు తెలియచేస్తున్న వారిపై పోలీసు అధికారులు ఇక నేరుగా చర్యలు తీసుకోవచ్చు. స్థానిక కోర్టుకు రాతపూర్వకంగా తెలియజేయకుండానే ఆందోళనకారులపై కేసులు నమోదు చేసే అధికారాన్ని కల్పిస్తున్న గుజరాత్ రాష్ట్ర బిల్లుకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. ప్రమాదాలను కలగజేస్తాయని భావించే అత్యవసర కేసుల్లో ఆదేశాలు జారీ చేసేందుకు పోలీసులకు, జిల్లా మేజిస్ట్రేట్‌లకు ఈ 144వ సెక్షన్ అధికారం కల్పిస్తోంది. గతేడాది మార్చిలో కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (గుజరాత్ సవరణ) బిల్లు, 2021ని రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వ విధానం నుండి పక్కకు మళ్లుతోందా? ఏ కేంద్ర చట్టంతోనైనా విభేదిస్తోందా? అన్న అంశాలను పరిశీలించాల్సిందిగా కోరుతూ ఈ బిల్లును కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపారు. వివిధ మంత్రిత్వ శాఖలతో సంప్రదింపులు జరిపిన తర్వాత, కేంద్ర హోం శాఖ తన అభిప్రాయాన్ని తెలియజేసి, ఆమోద ముద్ర వేసింది. ఆ తర్వాత రాష్ట్రపతి దీనిపై సంతకం చేశారు. దీంతో గుజరాత్‌లో ఇది చట్టంగా మారేందుకు మార్గం సుగమమైంది. అప్పటి గుజరాత్ హోం మంత్రి ప్రదీప్‌సిన్హా జడేజా ఈ బిల్లును ప్రతిపాదించారు. వివిధ సందర్భాల్లో శాంతి భద్రతలను కాపాడేందుకు లేదా ఏ వ్యక్తి అయినా నిర్దిష్ట చర్యకు దూరంగా వుండాల్సిందిగా ఆదేశిస్తూ సిఆర్‌పిసిలోని 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు జారీ చేసే అధికారం పోలీసు కమిషనర్‌కు, జిల్లా మేజిస్ట్రేట్‌కు ఈ బిల్లు కల్పించింది.

నిత్యావసర, పెట్రో ధరల పెరుగుదలపై చర్చించాలి

- అఖిలపక్ష సమావేశంలో మార్గాని భరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ధరల పెరుగుదలపై చర్చించాలని వైసిపి చీఫ్ విప్ మార్గాని భరత్ డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన అఖిల పక్ష సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశాల్లో సమయం వృథా చేయకుండా బిల్లులు, అంశాలపై చర్చ జరపాలని కోరామన్నారు. జి-20 సదస్సులో ఆంధ్రప్రదేశ్‌కి తగిన భాగస్వామ్యం కల్పించాలని కోరినట్లు చెప్పారు. క్రూడ్ ధరలు తగ్గినందున పెట్రోలియం ఉత్పత్తుల ధరలు తగ్గించాలని, తద్వారా మిగతా వస్తువుల ధరలు తగ్గి ద్రవ్యోల్బణం తగ్గుతుందని సూచించామని తెలిపారు. మహిళలపై దాడులను నిలువరించడానికి కఠినమైన దిశ చట్టాన్ని తీసుకొచ్చామని, దాన్ని కేంద్ర హోం శాఖ ఆమోదించాలని కోరినట్లు చెప్పారు. ప్రతి పంటకు కనీస మద్దతు ధర ఉండాలని సూచించామని తెలిపారు. దేశంలో ఒబిసిలు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారికి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒబిసి సంక్షేమ కోసం మంత్రిత్వ శాఖ ఎందుకు ఏర్పాటు చేయలేదని కేంద్రాన్ని ప్రశ్నించానని అన్నారు. కుల గణన జరిపించాలని కేంద్రాన్ని కోరుతున్నామని చెప్పారు. తాను రాష్ట్ర విభజనపై ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడుతున్నానని, కేంద్ర ప్రభుత్వమే విభజన చట్టాన్ని సవరించి ప్రత్యేక హోదాను అందులో పొందుపరచాలని కోరుతున్నానని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సమయానుకూలంగా నిధులు విడుదల చేయాలని, ఎందుకు కాలయాపన జరుగుతుందో కేంద్రం చెప్పాలని ప్రశ్నించానన్నారు. రెవెన్యూ లోటు సహా విభజన చట్టంలోని ఇతర సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, ఈ మేరకు నెలకొన్న సందిగ్ధతలకు సమాధానం చెప్పేలా విభజన చట్టంలో సవరణలు తీసుకురావాలని సూచిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి రావల్సిన రూ.6,800 కోట్ల బకాయిలు ఇప్పించాలని అన్నారు. కేంద్రంతో సఖ్యతతో ఉంటూనే రాష్ట్రానికి రావాల్సినవన్నీ రాబట్టుకుంటామని అన్నారు.

ఏపి పెండింగ్ అంశాలపై చర్చించాలి : కనకమేడల రవీంద్ర కుమార్

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి పెండింగ్ అంశాలపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ తెలిపారు. అఖిలపక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపి విభజన చట్టం అంశాలు అమలు చేయలేదని, అమరావతినే రాజధానిగా ఉంచాలని కోరామని తెలిపారు. రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితులపై దృష్టి పెట్టాలని కోరినట్లు చెప్పారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే
ఆసక్తి వ్యక్తీకరణ
EOI ప్రకటన నం. WHS/52/FEMS/VSKP RS/2022, తేది: 01.12.2022
పని పేరు: [illegible]
EOI సమర్పణ చివరి తేదీ: 16.12.2022న 1500 గంటలు & EOI తెరచు తేదీ: 16.12.2022న 1600 గంటలు.
వివరాలకు, దయచేసి సందర్శించండి వెబ్‌సైట్: http://eastcoastrail.indianrailways.gov.in → మా గురించి → డివిజన్ → వాల్తేరు డివిజన్ → టెండరు మరియు ప్రకటనలు → ఆసక్తి వ్యక్తీకరణ (EOI).
ఛీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, వాల్తేరు
PR-779/N/22-23

ఈస్ట్ కోస్ట్ రైల్వే
టెండరు నెం. SANDT_ZONAL_WAT-KTV
పని పేరు: వాల్తేరు డివిజన్ నందు సీనియర్ సెక్షన్ ఇంజనీరు/TELE/వాల్తేరు & సీనియర్ సెక్షన్ ఇంజనీరు/TELE/కొత్తవలస వారి పరిధిలో టెలికాం జోనల్ పని.
ప్రకటిత విలువ: ₹ 71,21,244.75, బయానా: ₹1,42,400/-, పూర్తి చేయు కాలం: 12 నెలలు, ఆఫర్ చెల్లుబాటు (రోజులు): 60
బిడ్డింగ్ ప్రారంభ తేది: 08.12.2022,
టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 22.12.2022న 1500 గంటలకు
ఈ టెండరునకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించరు మరియు ఏవైన అట్టి మాన్యువల్ ఆఫర్ అందినచో తిరస్కరిస్తారు.
పూర్తి వివరములు & టెండరు డాక్యుమెంట్లు లభించు వెబ్‌సైట్: http://www.ireps.gov.in
సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీరు, వాల్తేరు
PR-778/N/22-23

बैंक ऑफ़ इंडिया BOI Bank of India
హెడ్ ఆఫీస్ రికవరీ డిపార్ట్‌మెంట్
బహిరంగ అధికారిక ప్రకటన
బ్యాంక్ తన డీఫాల్టింగ్ రుణగ్రహీత కంపెనీ మెసెర్స్. ట్రాన్స్‌స్ట్రాయ్ ఓబెదుల్లగంజ్ బెతుల్ టోల్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క క్రింది డైరెక్టర్లు/హామీదారులను ప్రకటించింది. 14.11.2022న ఉద్దేశపూర్వక డీఫాల్టర్ యొక్క గుర్తింపు కమిటీ ఆర్డర్‌ను ఉద్దేశపూర్వక డీఫాల్టర్ యొక్క రివ్యూ కమిటీ నిర్ధారణకు లోబడి ఉంటుంది. కాంట్రాక్టు బకాయిలను తిరిగి [illegible]

క్ర. నం.	[illegible]	చిరునామా
1	మెసెర్స్. ట్రాన్స్‌స్ట్రాయ్ ఓబెదుల్లగంజ్ బెతుల్ టోల్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ (రుణగ్రహీత కంపెనీ)	చిరునామా: ప్లాట్ నం.201, 2022 మరియు 2020, గుల్మొహర్ ఎన్‌క్లేవ్, కావూరి హిల్స్, హైదరాబాద్-500081, తెలంగాణ.
2	మెసెర్స్. ట్రాన్స్‌స్ట్రాయ్ (ఇండియా) లిమిటెడ్ (కార్పొరేట్ హామీదారు)	చిరునామా: 5-91-25, 4వ లైన్, లక్ష్మీపురం, గుంటూరు-522007, ఆంధ్రప్రదేశ్.

[illegible]
అసిస్టెంట్ జనరల్ మేనేజర్, రికవరీ శాఖ, హెచ్.ఓ.

kotak Kotak Mahindra Bank
కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్
సెక్యూరిటైజేషన్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు
[illegible]
ప్రదేశం: విజయవాడ
తేది: 07.12.2022
అధీకృత అధికారి, కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్

మీకోసం

ఇడ్లీ లేదా దోశ పిండి పులిసినప్పుడు దానిలో ఎక్కువ నీళ్లు పోసి బాగా కలిపి అరగంటపాటు పక్కన పెట్టాలి. తర్వాత పై నీరంతా ఒంపేస్తే మిగిలిన పిండి తాజాగా ఉంటుంది.

జీవన సౌరభం

మనకు గల శక్తిని బట్టి మనల్ని మనం అంచనా వేసుకుంటాం. కానీ మనం చేసే పనులను బట్టి ఇతరులు మనల్ని అంచనా వేస్తారు.

చిన్మయికి ప్రతిభా పల్లవ పురస్కారం

బాలల సృజనాత్మకతను వికసింపజేయడం కోసం ప్రొ. కొండేపూడి లావణ్య స్మృతిగా గుంటూరులోని బాలకుటీర్.. ప్రతిభా పల్లవ పురస్కారం 1994లో నెలకొల్పింది. వివిధ లలిత కళల్లో ప్రతిభా పాటవాలను కనబరుస్తున్న బాలలకు అందజేసే ఈ పురస్కారం.. 'ఉల్లేఖనా విన్యాసిని' అని పేర్కొంటూ ఈ ఏడాది పుచ్చా చిన్మయికి ప్రకటించారు.

పుచ్చా చిన్మయి ... విజయవాడలోని సిద్ధార్థ పబ్లిక్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. పలు ఆసక్తులు, అభినివేశాలు ఉన్న ఈ అమ్మాయి ఇప్పుడే విచ్చుకుంటున్న ప్రతిభా కుసుమం. చిన్మయి రాసిన కవితా పంక్తులు పరిశీలిస్తే.. ఆమెలోని ప్రతిభ అర్థమవుతుంది.

'ముద్ద తింటున్న ప్రతి ఒక్కరికి వ్యవసాయం బాధ్యత అవ్వాలి.. రైతు జీవితం పాఠం అవ్వాలి.. పంట పండించడానికి రైతు పడే కష్టం.. పురిటి నొప్పులు పడే తల్లికి తీసిపోదు.' అంటూ రైతు గురించి రాసింది. 'మాతృమూర్తి తరువాత అమ్మ 'భాషే ..' అంటూ తెలుగు భాష విలువను, అవసరాన్ని గుర్తించింది. నా ఊహలకే రెక్కలు వస్తే పై పైకి ఎగిరిపోతాను' అంటున్న చిన్మయి ఒక గొప్ప భావనా ప్రపంచాన్ని మనముందు ఉంచుతుంది. పుస్తకాలు చదవడమన్నా, ఫొటోగ్రఫీ అన్నా తనకు అమిత ఆసక్తి. వివిధ అంశాల మీద చక్కగా ఉపన్యసిస్తుంది. కమ్మగా పాటలు పాడుతుంది. అంతేకాదు; అర్థవంతమైన కొటేషన్లు రాస్తుంది. అందుకే తను ఉల్లేఖ విన్యాసినిగా గుర్తింపు పొందింది. చదువులోనూ మెరుగైన రీతిలో రాణిస్తోంది. ఇన్నింటా తన ప్రతిభను చూపిస్తున్నందుకుగాను చిన్మయి ఈనెల 10వ తేదీన గుంటూరులో ప్రతిభా పల్లవ పురస్కారాన్ని తెలుగు భాషాభిమాని శివ జాస్తి గారి చేతుల మీదుగా ఆదుకోబోతోంది.

చుక్కలు కలపండి

చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ

- జి. లోహిత,
5వ తరగతి,
ఎం.పి.పి.ఎం.పి. స్కూలు,
తిరుమల.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఊళ్లో గ్రంథాలయం

బీహార్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సుశీల్‌కుమార్ తండ్రి రామ్ నగీనా ప్రసాద్, తాతలు రోహ్తాస్ జిల్లా, గోర్డిహి అనే చిన్న గ్రామంలో నివసించారు. ఆయన వారి జ్ఞాపకార్థం పూర్వీకులు నివాసం ఉన్న ఇంటినే లైబ్రరీగా మార్చారు. అందులో విద్యార్థులకు ఉపయోగపడే సాహిత్యం, ఆర్థికశాస్త్రం, చరిత్ర, పోటీ పరీక్షల పుస్తకాలు, కథల పుస్తకాలు, మ్యాగజైన్లు 1000కి పైగా కొనుగోలు చేసి, కొన్ని సేకరించి ఉంచారు. కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటుచేసి, గ్రామస్తుల అభివృద్ధికి కృషి చేశారు.

దాంతో గ్రామంలో పిల్లలు స్కూలు నుంచి ఇంటికి వచ్చిన తర్వాత లైబ్రరీకి వచ్చి చదువుకుంటున్నారు. సెలవు దినాల్లో ఇంట్లో చదువుకునే వీలు లేని పిల్లలు లైబ్రరీకి వస్తున్నారు. ఆసక్తి ఉన్న వారు ఎవరైనా పుస్తకాలను ఇంటికి తీసుకెళుతున్నారు. 15 రోజుల తర్వాత తిరిగి లైబ్రరీకి అందజేస్తున్నారు. దాంతో గ్రామస్తుల్లో, యువతలో పఠనాసక్తి పెరిగింది. లైబ్రరీకి వస్తున్న దినపత్రికలను ఊరిలో పెద్దవాళ్లు చదువుతూ విజ్ఞానం పెంచుకుంటున్నారు. ఈ గ్రంథాలయం గురించి తెలిసిన చుట్టుపక్కల గ్రామాల్లోని పిల్లలు వచ్చి పాఠ్య పుస్తకాల్లోని అనుమానాలు తీర్చుకుంటున్నారు.

'ఇంట్లో ఏకాగ్రత కుదురదు. అందుకే ప్రతి రోజూ లైబ్రరీకి వచ్చి చదువుకుంటా. జీవశాస్త్రంలో ముఖ్యమైన విషయాలు ఇక్కడున్న పుస్తకాల్లో చదివి రాసుకుంటున్నా.' అంటున్నాడు ఇంటర్ విద్యార్థి రాధే మోహన్. 'పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. ఇక్కడున్న చరిత్ర పుస్తకాలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. దాంతో స్టడీ మెటీరియల్ నేను తయారు చేసుకుంటున్నా' అంటున్నాడు మరో విద్యార్థి రవి రంజన్. అనేక మంది విద్యార్థులు తమ చదువు పూర్తయిన తర్వాత తమ పాఠ్యపుస్తకాలను గ్రంథాలయానికి అందజేసి ఇతర విద్యార్థులకు సహాయం చేస్తున్నారు. ఒకప్పుడు మొబైల్ ఫోన్లు చూస్తూ కాలక్షేపం చేసే గ్రామ పిల్లలు లైబ్రరీ వల్ల క్రమశిక్షణతో పుస్తకాలు పట్టుకుని చదువుకుంటున్నారు. ఇది మంచి మార్పే కదా!

బాల్యంలో పోటీ పరీక్షలకు తయారు కావాలని పట్టుదల ఉన్నా వసతులు లేక తాను ఎంత బాధను అనుభవించారో సుశీల్‌కుమార్‌కు తెలుసు. అందుకే గ్రామంలో పిల్లలకు లైబ్రరీ ఏర్పాటు చేశారు. అందులో వెయ్యికి పైగా పుస్తకాలు అందుబాటులో ఉంచి వారి విద్యాభివృద్ధికి ప్రోత్సహించారు. పెద్దవారూ చదువుకునేలా మ్యాగజైన్లు, అవసరమైన పుస్తకాలూ ఉంచారు.

గొంతు గరగర పోవాలంటే ...

చలికాలంలో గొంతులో కఫం పేరుకుపోయి పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ఇబ్బంది పడుతుంటారు. కఫం పేరుకోవడం వల్ల దగ్గు, శ్వాస సరిగ్గా తీసుకోలేకపోవడం, చికాకు, మింగడానికి తీవ్రమైన ఇబ్బంది, ఛాతి నొప్పి వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కఫం విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే దగ్గుకు కూడా దారితీస్తుంది. అందుకే వీలైనంత త్వరగా కఫాన్ని నివారించుకోవాలి.

- ఒక ఉల్లిపాయను తీసుకుని మెత్తగా రుబ్బి రసం తీసుకోవాలి. ఆ రసంలో కొద్దిగా స్వచ్ఛమైన తేనె కలుపుకుని తాగాలి. ఇలా చేయడం వల్ల ఉల్లిలో ఉండే సల్ఫర్ కఫాన్ని నివారిస్తుంది.
- ఒక గ్లాసు నీళ్లలో కొన్ని పుదీనా ఆకులు వేసి బాగా మరిగించి వడబోసుకోవాలి. ఈ నీటిలో కొద్దిగా నిమ్మ రసం కలిపి తాగినా కఫం క్రమంగా తగ్గిపోతుంది.
- గోరు వెచ్చని పాలలో అర టీ స్పూన్ పసుపు వేసి తాగితే గొంతులో గరగర మాయమవుతుంది.
- అల్లాన్ని పేస్ట్ చేసి, దాల్చిన చెక్కను పొడి చేసి, వాటితో టీ పెట్టుకొని తాగాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తే ఫలితం కనిపిస్తుంది.
- పుదీనా ఆకుల్ని నీటిలో వేసి ఐదు నిమిషాలు మరిగించి ఆ నీళ్లు తాగితే కఫం తగ్గుతుంది.
- ఐదు మిరియాలు, రెండు యాలకులు, చిన్న దాల్చిన చెక్క ముక్క తీసుకుని మెత్తటి పొడిలా దంచుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక గ్లాసు నీటిలో వేసి ఐదు నిమిషాలు మరిగించాలి. ఆ నీటిని వడబోసుకుని అందులో తేనెను కలుపుకుని ప్రతి రోజు ఉదయాన్నే తాగితే గొంతులో పేరుకు పోయిన కఫం మొత్తం క్రమంగా కరిగిపోతుంది.
- అలాగే తరచూ ఆవిరి పడుతూ ఉండాలి. ఆవిరి పట్టడం వల్ల కఫం తగ్గి గొంతు శుభ్రపడుతుంది.
- దాహంగా ఉన్నా లేకపోయినా నీళ్లుఎక్కువగా తాగాలి.



తల్లో దురద తగ్గించుకోండి

- జిడ్డుగా కనిపిస్తుందని చాలామంది తలకు నూనె రాయరు. దీంతో కుదుళ్లు పొడిబారిపోయి దురదకు దారి తీస్తుంది. అలాగే జుట్టు కూడా నిర్జీవమైపోతుంది. దురద ఏర్పడి చుండ్రుకు దారి తీస్తుంది. అందుకే బాదం, ఆలివ్.. వంటి సహజ సిద్ధంగా లభించే నూనెలను రాసుకోవాలి. గాఢత తక్కువగా ఉన్న షాంపూతో లేదా కుంకుడుకాయలతో తలస్నానం చేయాలి.
- దుమ్ము, ధూళిలో ఉన్నప్పుడు తల్లో దురద పెడుతూ ఉంటుంది. అప్పుడు పెరుగు, నిమ్మకాయ రసం కలిపి తలకు పట్టించాలి. తర్వాత గోరు వెచ్చని నీటితో తలస్నానం చేయాలి.
- ప్రతిరోజూ తలస్నానం చేయడం కూడా ప్రమాదమే. తల్లో నిర్జీవ కణాలు పొడిబారి పోతాయి. వారంలో ఒకసారి తలస్నానం చేయాలి.
- కుదుళ్లకు సరైన రక్తప్రసరణ లేకపోవడం వల్ల కూడా దురద వస్తోంది. కాబట్టి నూనె రాసుకునే ముందు దాన్ని కాస్త గోరు వెచ్చగా చేసుకుని, 15 నిమిషాలు మసాజ్ చేయాలి.
- తలస్నానం చేసిన తర్వాత జుట్టు పూర్తిగా ఆరబెట్టుకోవాలి. తడిగా ఉన్నప్పుడే జడ వేసుకుంటే దురద వచ్చే అవకాశం ఉంటుంది.
- తెలుపు వెంట్రుకలకు రంగు వేస్తూ ఉంటారు. రంగులో కెమికల్ ప్రభావం వల్ల కూడా దురద వస్తుంది. రంగుకు బదులు సహజసిద్ధమైన పద్ధతులు గోరింటాకు, మెంతి పొడి, మందారాకు పేస్టు పెట్టుకోవడం మంచిది.
- తల్లో దురద తగ్గించడంలో ఆహారానిది కూడా కీలకపాత్రే. మైక్రో న్యూట్రియంట్లు అధికంగా లభించే పండ్లు, కూరగాయలు వంటివి రోజూ ఆహారంలో భాగం చేసుకోవాలి. దీనివల్ల కుదుళ్లు ఆరోగ్యంగా తయారై జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. దురదా తగ్గుతుంది.

ఓటీటీలో 'యశోద'

సమంత ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'యశోద'. హరి, హరీష్ తెరకెక్కించిన ఈ చిత్రం ఓటిటి హక్కులు సొంతం చేసుకున్న ప్రైమ్ వీడియో సంస్థ ఈ చిత్రాన్ని డిసెంబర్ 9 నుండి అన్ని భాషల్లో స్ట్రీమింగ్‌కి అందుబాటులో ఉంచనున్నది. థియేటర్‌లో విడుదలై నెల రోజులు గడవక ముందే ఓటీటీలో విడుదలవుతున్న ఈ చిత్రం సరోగసి ప్రధాన ఇతివృత్తంగా థ్రిల్లర్ అంశాలతో తెరకెక్కింది.

ఈ వారంలోనే బాలకృష్ణ కొత్త సినిమా ప్రారంభం..

అనిల్ రావిపుడి బాలకృష్ణ కాంబినేషన్‌లో రాబోతున్న కొత్త చిత్రం డిసెంబర్ 8 నుండి సెట్స్ మీదకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. 12 రోజుల పాటు జరిగే ఈ తొలి షెడ్యూల్‌లో యాక్షన్ ఎపిసోడ్ షూట్ చేస్తారని సమాచారం. ఇప్పటివరకు వినోదాత్మక చిత్రాలను తెరకెక్కించిన అనిల్ రావిపుడి మొదటిసారి ఫుల్ లెంగ్త్ మాస్ మూవీ చేస్తున్నారు. అయితే ఈ మూవీలో మాస్ అంశాలు ఉన్నా సినిమా మాత్రం తన పంథాలో ఎంటర్టైనింగ్‌గా సాగుతుందని అంటున్నారు. ఈ యాక్షన్ సీన్స్ కూడా రెగ్యులర్ బాలకృష్ణ సినిమాల్లో ఉండేలా కాకుండా కొత్తగా ప్లాన్ చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రంలో పెళ్లిసందడి ఫేం శ్రీ లీల ప్రధాన పాత్రలో నటిస్తుండగా ప్రియాంక జవల్కర్ హీరోయిన్‌గా నటిస్తుందని సమాచారం.



మాలీవుడ్ నిర్మాత హఠాన్మరణం

మాలీవుడ్ నిర్మాత జైసన్ జోసెఫ్(44) కొచ్చిలోని తన అపార్ట్‌మెంట్‌లో మృతిచెందారు. విదేశాల్లో ఉన్న కుటుంబసభ్యులు రెండు రోజులుగా జైసన్ నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో అపార్ట్‌మెంట్ నిర్వాహకులకు సమాచారం అందించారు. దీంతో సోమవారం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియలేదు. పోస్టుమార్టం కోసం మృతదేహన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనేక మాలీవుడ్ చిత్రాలకు నిర్మాతగానే కాక కేరళ నిర్మాతల సంఘంలో సభ్యుడిగా, ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ యజమానిగా జైసన్ వ్యవహరిస్తున్నారు. ఆయన మృతి పట్ల మాలీవుడ్ హీరోలు, నటులు, నిర్మాతలు, దర్శకులు సంతాపం తెలుపుతున్నారు. చిన్నవయసులోనే ఆయనను కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'ధమ్ కీ' ఫస్ట్ సింగిల్

యువ హీరో విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'ధమ్ కీ'. ఈ చిత్రం నుంచి సింగిల్ 'ఆల్‌మోస్ట్ పడిపోయిందే పిల్లా' సాంగ్ తెలుగు, హిందీ లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ పాటను పూర్ణచారి రాయగా, లియోన్ జేమ్స్ కంపోజిషన్‌లో ఆదిత్య ఆర్‌కే, లియోన్ జేమ్స్ కలిసి పాడారు. ఈ పాటను హిందీలో అమితాబ్ వర్మ రాయగా.. నకాశ్ అజీజ్, లియోన్ జేమ్స్ పాడారు. యశ్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశాడు. ఐలాండ్, సముద్రతీరంలో విశ్వక్‌సేన్, నివేదా పేతురాజ్ మధ్య వచ్చే ఈ సాంగ్‌ను అభిమానులను ఆకట్టుకుంటోంది. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో రావు రమేశ్, హైపర్ ఆది, పృథ్వీరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వన్మయి క్రియేషన్స్, విశ్వక్ సేన్ సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. కామెడీ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

ఓటీటీలో 'జగమే మాయ'

సునీల్ దర్శకత్వంలో చైతన్య, తేజ, ధన్య బాలకృష్ణన్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'జగమేమాయ'. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం నేరుగా ఓటీటీలో విడుదల కానుంది. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ వేదికగా ఈ నెల 15న స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. డబ్బు కోసం మనుషులు ఎలా ప్రవర్తిస్తారు? ఏ విధంగా ఆలోచిస్తారు వంటి అంశాల నేపథ్యంగా చిత్రాన్ని తీశారు. ట్రైలర్‌లో థ్రిల్లర్, సస్పెన్స్‌తో కథ సాగినట్లు చూపించారు.

మొరాకో గోల్‌కీపర్‌ను అభినందిస్తున్న ఆటగాళ్లు

గోల్ కొట్టి బ్రెజిల్ ఆటగాళ్ల సంబరాలు

స్పెయిన్ ఔట్..

మొరాకో చేతిలో షూటౌట్‌లో ఓటమి

- క్వార్టర్స్‌కు బ్రెజిల్, మొరాకో
- 36ని.ల్లోనే బ్రెజిల్ నాలుగు గోల్స్

దోహా: ఫిఫా ప్రపంచకప్-2022 ప్రి క్వార్టర్స్‌లోనే 2010 ఛాంపియన్ స్పెయిన్ జట్టు వెనుదిరిగింది. మంగళవారం జరిగిన ఉత్కంఠ పోటీలో స్పెయిన్ జట్టు 0-3 గోల్స్ తేడాతో మొరాకో ఓటమిని చవి చూసింది. నిర్ణీత సమయంతో పాటు 30 నిమిషాల అదనపు సమయంలోనూ ఇరుజట్లు గోల్ చేయలేకపోయాయి. దీంతో ఫలితం కోసం పెనాల్టీ షూటౌట్‌కు దారితీయగా.. స్పెయిన్ జట్టు ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. మరోప్రక్క మొరాకో జట్టు 3 గోల్స్ కొట్టి విజయాన్ని సొంతం చేసుకుంది. క్వార్టర్స్‌లో మొరాకో జట్టు పోర్చుగల్-స్విట్జర్లాండ్ మ్యాచ్ విజేతతో తలపడనుంది.

సోమవారం రాత్రి జరిగిన ప్రి క్వార్టర్స్ పోటీలో బ్రెజిల్ 4-1గోల్స్ తేడాతో దక్షిణ కొరియాను చిత్తుచేసింది. బ్రెజిల్ జట్టు 4గోల్స్‌ను తొలి అర్థ భాగంలోనే చేయడం విశేషం. మ్యాచ్ ప్రారంభమైన 7వ ని.లోనే విని జూనియర్ గోల్ చేయడంతో 1-0 ఆధిక్యతను సంపాదించిన బ్రెజిల్ జట్టు. ఆ తర్వాత 13వ ని.లో నెయ్‌మార్ చేసిన గోల్‌తో 2-0 ఆధిక్యతను సంపాదించింది. ఆ తర్వాత రిచర్లిసన్ (29వ ని.), లూకాస్(36వ ని.) ఒక్కో గోల్ చేయడంతో బ్రెజిల్ తిరుగులేని 4-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్ పూర్తి ఏకపక్షంగా సాగింది. గ్రూప్ దశలో ఆఖరి లీగ్ మ్యాచ్‌లో కామరూన్ చేతిలో ఓటమితో బ్రెజిల్ దెబ్బ తిన్న పులుల్లా ఈ మ్యాచ్ బరిలోకి దిగింది. బ్రెజిల్ స్టార్ ఆటగాడు నెయ్‌మార్ ఈ మ్యాచ్‌లో పునరా గమనం చేసి ఓ గోల్ కూడా చేశాడు. 76వ నిమిషంలో కొరియా ఆటగాడు కిమ్ సెయూంగ్ గ్యూ ఒక గోల్ కొట్టాడు.

ఆదమరిస్తే అంతే..

బంగ్లాదేశ్‌తో రెండో వన్డే నేడు

ఉదయం 11.30గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

ఢాకా: తొలి వన్డేలో సునాయాసంగా గెలుస్తుందనుకున్న టీమిండియాకు బంగ్లాదేశ్ షాక్ ఇచ్చింది. ఈ వన్డేలో చివరి వికెట్‌కు బంగ్లా బ్యాటర్ అద్భుతంగా ఆడి టీమిండియాకు ఝలక్ ఇవ్వగా.. ఆ ఓటమినుంచి తేరుకొన్న టీమిండియా బ్యాటర్స్ బంగ్లాదేశ్‌తో రెండో వన్డేకు సిద్ధమయ్యారు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం ఇరుజట్ల మధ్య రెండో వన్డే మ్యాచ్ జరగనుంది. తొలి వన్డే ఓటమితో తేరుకున్న భారతజట్టు ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్ రేసులో నిలవనుంది. బంగ్లా పర్యటనకు సీనియర్ క్రికెటర్లు రోహిత్, కోహ్లి, కేఎల్ రాహుల్‌తోపాటు యువ బౌలర్లు అందుబాటులో ఉన్నారు. ఈ క్రమంలో టీమిండియా సమిష్టిగా రాణిస్తేనే బంగ్లాపై పైచెయ్యి సాధించే అవకాశముంది.

దేశవాళీ సిరీస్‌లలో మహిళా అంపైర్లు: బిసిసిఐ

మహిళా అంపైర్ల విషయంలో భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మహిళా అంపైర్లకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. త్వరలో ప్రారంభం కానున్న రంజీ ట్రోఫీలో మహిళా అంపైర్లు కనిపించనున్నారు. మన దేశంలో ప్రస్తుతం గాయత్రి, జనని, వృందారతి తదితర మహిళా అంపైర్లు ఉన్నారు. రాబోయే రోజుల్లో మహిళా అంపైర్ల సంఖ్యను మరింత పెంచాలని బిసిసిఐ తాజాగా నిర్ణయించింది. భవిష్యత్తులో అంతర్జాతీయ క్రికెట్‌లో సైతం మహిళా అంపైర్లు కనిపిస్తారని బిసిసిఐ అధికారులు తెలిపారు. ఈ నిర్ణయం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది.

మహిళల బ్యాటింగ్ కోచ్‌గా కనిత్కర్
ఎన్‌సిఏకు రమేశ్ పవార్

భారత మహిళల జట్టు బ్యాటింగ్ కోచ్‌గా మాజీ క్రికెటర్ హృషికేశ్ కనిత్కర్(48) నియమితులయ్యారు. దీంతో ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న రమేశ్ పవార్‌ను బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సిఏ)కు బదిలీ చేశారు. పవార్ ఎన్‌సిఏలో వివిఎస్ లక్ష్మణ్‌తో కలిసి పనిచేయనున్నారు. ఈ నెల 9 నుంచి ముంబైలో ఆస్ట్రేలియాతో ప్రారంభమయ్యే 5మ్యాచుల టీ20 సిరీస్‌కు ముందు హృషికేశ్ జట్టులో చేరతాడని బిసిసిఐ మంగళవారం తెలిపింది.

టైటాన్స్ ఖాతాలో 19వ ఓటమి

ప్రొ కబడ్డీ సీజన్-9

హైదరాబాద్: ప్రొ కబడ్డీ సీజన్-9లో తెలుగు టైటాన్స్ ఓటముల పరంపర కొనసాగుతోంది. మంగళవారం గుజరాత్ జెయింట్స్ చేతిలో 44-30పాయింట్ల తేడాతో టైటాన్స్ పరాజయాన్ని చవిచూసింది. అభిషేక్ సింగ్ 9రైడ్ పాయింట్లు సాధించగా.. హనుమంతు 6 ట్యాకిల్ పాయింట్లు సాధించాడు. ఒక గుజరాత్ జట్టులో పార్థిక్ దహియ ఏకంగా 17రైడ్ పాయింట్లు సాధించగా.. లీ డొంగ్(9) పాయింట్లు సాధించాడు. ఇక టైటాన్స్ 2సార్లు ప్రత్యర్థి జట్టును ఆలౌట్ చేస్తే.. గుజరాత్ ఏకంగా 4సార్లు టైటాన్స్‌ను ఆలౌట్ చేసింది. దీంతో ఈ సీజన్‌లో టైటాన్స్ ఇప్పటివరకు 21 మ్యాచుల్లో కేవలం 2 మ్యాచుల్లో గెలిచి 19మ్యాచుల్లో ఓటమిపాలైంది. టైటాన్స్ ఖాతాలో 15పాయింట్లు ఉండగా.. 12జట్లు బరిలోకి దిగిన ఈ సీజన్‌లో టైటాన్స్ చివరిస్థానంలో నిలిచింది. తొలి మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 41-24పాయింట్ల తేడాతో యు ముంబను ఓడించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68